
జన రాజకీయం కోసం...

₹ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి - 8 సంచిక - 22

పక్షపత్రిక నవంబర్ 16-30, 2017



## అవినీతిపై ప్రగల్భాల వీరులు



## మొక్కుబడి ప్రక్రియ కాదు... సజీవ పరివర్తనాపత్రం



## గత మూడేళ్లలోనే పాలకుల విధానాలు రైతులకు చేసిన నష్టం : రూ.4,00,000 కోట్లు !






# 'స్థానిక కోర్టుల' ఏర్పాటుకు ఇప్పటికైనా చొరవ తీసుకుంటారా పోలీస్ మేడం!

మహిళల భద్రత కోసం తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్‌లో 'షీ' టీమ్స్‌ను ప్రారంభించి 2017కి మూడేళ్లు గడిచిపోయాయి. నగర అదనపు పోలీస్ కమిషనర్ స్వాతి లక్రా ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ బృందాలు పనిచేస్తున్నాయి. ఈ మూడేళ్లలో నగరంలో మహిళలపై వేధింపులు, అత్యాచారాలు ఏమైనా తగ్గాయా అంటే.... హోంమంత్రి కూడా నసుగుతున్నారు. తెలంగాణలో మహిళల పై నేరాలు అంతకుముందు ఏడాది కంటే 2016లో 7.35 శాతం పెరిగాయి.

ఇటీవల హార్వర్డ్ యూనివర్సిటీలో వారం రోజులపాటు నాయకత్వ శిక్షణకు అమెరికా వెళ్లిన స్వాతి లక్రా... న్యూయార్క్, అరిజోనా నగరాల్లో స్థానిక పోలీసులతో కలిసి పనిచేశారు. హైదరాబాద్‌కు తిరిగొచ్చాక ఆ వివరాలను ఒక ప్రముఖ తెలుగు పత్రిక మహిళా పేజీ ఇంటర్వ్యూలో పంచుకున్నారు. అమెరికా నగరాల్లో 20 ఏళ్ల నుంచి ఈవ్‌టీజింగ్ కేసులే లేవని ఆమె చెప్పారు. స్త్రీలను సమానంగా గౌరవించటాన్ని పాఠశాల స్థాయి నుంచే పిల్లలకు బోధించటం, అయినా నేరాలకు పాల్పడ్డవారిని వేగంగా శిక్షించేందుకు కోర్టుల ఏర్పాటు ద్వారా అమెరికావాళ్లు ఈవ్‌టీజింగ్‌ను అదుపుచేశారని చెప్పారు. ఈ పాఠాల్ని మనదేశం కూడా నేర్చుకోవాలని స్వాతి లక్రా అభిప్రాయపడ్డారు.

పోలీస్ మేడం ! ఈ విషయాల్ని లోక్‌సత్తా మీ దృష్టికి, ఇతర పోలీసుల దృష్టికి, ప్రభుత్వాల దృష్టికి ఎన్నిసార్లు తీసుకురాలేదు? స్థానిక కోర్టుల్ని (ఈ చట్టాన్ని లోక్‌సత్తాయే 2009లో సాధించింది) ఏర్పాటు చేస్తే అత్యాచారం వంటి నేరాల్ని ఈవ్‌టీజింగ్ దశలోనే అడ్డుకోవచ్చు ఈవ్‌టీజింగ్ వంటి నేరాలకు మరోసారి పాల్పడకుండా, కొత్తవారు అనుకరించకుండా ఆపవచ్చని లోక్‌సత్తా సూచించింది. స్థానిక కోర్టుల ఏర్పాటుతోపాటు... పోలీసు స్టేషన్‌కి స్వేచ్ఛగా వెళ్లి ఫిర్యాదు చేయగలిగేలా పౌర సేవల చట్టం తేవటం, శాంతిభద్రతల విభాగాన్ని ఆధునీకరించటం, స్కూలు స్థాయి నుంచీ పిల్లల్లో లింగ సమానత్వ భావనను పెంచేలా పాఠ్యాంశాలను, కార్యక్రమాలను రూపొందించటం తదితర చర్యల్ని చేపట్టాలని కోరింది. షీ టీమ్స్ ఏర్పాటు సమయంలో ఈ పరిష్కారాల్ని ప్రత్యేకించి ప్రచారం చేసింది.

పోలీసు సంస్కరణలపై హైదరాబాద్‌లోనే పోలీసు ఉన్నతాధికారుల సమావేశంలో లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జేపీ చేసిన ప్రసంగం కవర్‌స్టోరీగా ఉన్న లోక్‌సత్తా టైమ్స్‌ను 2015లో తెలంగాణ డీజీపీతోపాటు కూకట్‌పల్లిలో మీరు కూడా ఆవిష్కరించారు. అందులో కూడా ఈ అంశాలున్నాయి. మీ సహచరులతో ఇంటరాక్షన్‌లో కూడా ఇవి ప్రస్తావనకు వచ్చే అవకాశముంది.

మీరు నిబద్ధత గల అధికారిణి. మహిళల భద్రతకు కేసీఆర్ కృతనిశ్చయంతో ఉన్నారు. మరి స్థానిక న్యాయస్థానాల ఏర్పాటు ఇతర సంస్కరణల గురించి లోక్‌సత్తా విజ్ఞప్తి చేసినప్పుడే ఎందుకు మేలుకోలేదు? మీరు అడిగితే ప్రభుత్వం కాదంటుందా? అమెరికా నుంచో మరో దేశం నుంచో కొత్త విషయం నేర్చుకోవటం తప్పుకాదు. కానీ మీకు ఎప్పటి నుంచో హైదరాబాద్‌లోనే, ఇండియాలోనే చెబుతున్న విషయాల్ని అమెరికా నుంచి నేర్చుకున్న కొత్త విషయంగా చెప్పటం ఏ రకమైన ప్రజాసేవ? ఇకనైన స్థానిక కోర్టుల ఏర్పాటుకు, స్కూలు స్థాయి నుంచి లింగసమానత్వ అవగాహనను పెంచేందుకు మీరు చొరవ తీసుకుంటారని ఆశిస్తున్నాం.

**మహిళల భద్రత, చట్టబద్ధపాలన కోసం సపోర్ట్ : 'జనం కోసం జేపీ' సురాజ్య యాత్ర**

**Join & Participate: www.youthforbetterindia.com**

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక

నవంబర్ 16-30, 2017 సంపుటి - 8 సంచిక - 22




## కార్టూన్ కార్నర్

## లోపలి పేజీల్లో...

ఆ దేశాల్లో మామూలుగా అయ్యే .................... 5
గత మూడేళ్లలోనే పాలకుల విధానాలు............ 7
అట్టడుగు స్థాయిలో పన్నులు తప్ప నిధులేవీ?...... 10
ఇవాళ కుంభవృష్టి.. రేపు మంచినీటికి కటకట.... 11
ప్రైవేటుకు వేల కోట్లు... రాయలసీమ పెద్దాస్పత్రికి. 12
ఇలాంటి కళాశాలలకన్నా జైళ్లే నయం............. 13
జంపరకోట పట్ల నిర్లక్ష్యం దారుణం................ 14
కాకి లెక్కల పోలికలు చూసి కంగారుపడొద్దు.... 15
నా స్వార్థమేమిటో అర్థమైంది కాబట్టే సమాజం.... 16
మాలాంటివారికి అందిన చదువు ప్రతి బిడ్డకూ... 18
ఆలోచనతో నిర్ణయాలు తీసుకోండి................ 19
గ్రామాలకు 50శాతం నిధులు రావాలి............ 20
ఆత్మగౌరవంతో బతికితేనే సురాజ్యం.............. 21
అవినీతిపై ప్రగల్భాల వీరులు.......................... 22
అవినీతిపరుల రక్షణ నిలయం సచివాలయమే.... 27
సామాన్య ప్రజలను మోసకారులుగా .............. 28
గ్రంథాలయ సొమ్ము మీ దగ్గర ఉంచుకోడానికి.... 30
యువతంటే నాయకుల కొడుకులు కాదు......... 31
(మీడియాలో) 'కీ' కామెంట్లు ! ...................... 32
ముఖ్యమంత్రి సొంత జిల్లాలో పల్లె కన్నీరు......... 33

### సంపాదక వర్గం

డా॥ జయప్రకాష్ నారాయణ్
ప్రధాన సంపాదకులు

బండారు రామ్మోహన్‌రావు
డా॥ ఆలూరి విజయలక్ష్మి
కె.వి. కుటుంబరావు

### రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
తులిప్స్ అపార్ట్‌మెంట్స్
6-3-655, ఫ్లాట్ నెం. 407
సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక
సోమాజిగూడ, హైదరాబాద్ – 500 082

**ఫోన్ : 040-23310288**
**ఫోన్ / ఫ్యాక్స్ : 040-23311816**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

### చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం: **040-23311816**

విడి ప్రతి : రు. 10 ,
ఏడాది చందా : రు. 200
మూడేళ్ళ చందా : రు. 500

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: 62007167836, **SBI** పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.

IFSC No: SBIN0020072

### లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజీ | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |


♦ ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి

# రాజ్యాంగం మొక్కుబడి ప్రక్రియ కాదు.. సజీవ పరివర్తనాపత్రం!



తక్షణ అవసరాల్ని, దీర్ఘకాలిక ప్రజాప్రయోజనాల్ని ముడివేయటమే సిసలైన రాజకీయం. ఇలా రాజనీతిజ్ఞత ఉట్టిపడేలా తన పార్టీని దేశవ్యాప్తంగా గెలిపిస్తూ కూడా గొప్ప ప్రధానిని అనిపించుకోవాలనే క్రమంలో నరేంద్రమోదీ విచిత్రమైన వ్యూహాన్ని అనుసరిస్తున్నారు. చివరికి ఎన్నికల్లో గెలవటానికి తప్ప పరిపాలనకు పనికొచ్చేరకం కాదనే అనుమానం ప్రజల్లో బలపడేలా చేసుకుంటున్నారు. ఇప్పటికి కూడా మోదీ ప్రభుత్వ లక్ష్యం సుపరిపాలనేనని నమ్ముతున్న ప్రజలు పెద్దసంఖ్యలోనే ఉన్నారు. పైకి చూడ్డానికి కూడా పాలనా చర్యలు అలాగే ఉంటాయి. కానీ ఎంపిక చేసుకున్న పైపై చర్యల్ని ఎంపిక చేసుకున్న మేర అమలుచేయటానికే పరిమితమవటం వల్ల సమస్యలు మాత్రం అలాగే కొనసాగుతున్నాయి, కొత్తరూపంలో గందరగోళాన్ని, సంక్షోభాన్ని పెంచుతున్నాయి. అవినీతిపైన పోరాటాన్నే మచ్చుకు తీసుకుంటే.. ఏడాది క్రితం ప్రకటించిన పెద్ద నోట్ల రద్దు (డీమానిటైజేషన్) నల్లధనాన్ని నిర్మూలించేందుకేనన్నారు. బ్యాంకుకు తిరిగిచ్చిన పాతనోట్లకు సరిపడా కొత్త నోట్లను సిద్ధం కూడా చేయకుండా అత్యంత అసమర్ధంగా దీన్ని అమలు చేశారు. కొత్తనోట్లు పలుకుబడిగలవారికే ముందు చేరాయి. వారు నల్లధనాన్ని బ్యాంకుల ద్వారా తెలుపుగా మార్చుకున్నారు. బ్యాంకు సిబ్బంది స్థాయి నుంచి పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడకుండా ఇది సాధ్యంకాదు. కానీ ఏ ఒక్కరిపైనా చర్య లేదు. కరి మింగిన వెలగపండులా తయారైన ఆ నల్లధనం లెక్కలు ఎప్పుడు తేలతాయో, చర్యలు ఎప్పుడుంటాయో ఎవరికీ తెలీదు. నోట్ల రద్దు వల్ల ప్రజలు పడ్డ కష్టానికి ప్రతిఫలం రావాలంటే.. అవినీతి నిరోధానికి మిగిలిన ఈ చర్యలు కూడా తీసుకోండని లోక్‌సత్తా నిర్దిష్టంగా సూచనలిచ్చినా మోదీ ప్రభుత్వం మౌనప్రేక్షక పాత్ర వహించింది. కానీ నోట్ల రద్దు నిర్ణయంతో.. అప్పటిదాకా ఓట్లు కొనుగోలు చేస్తూ, చోటామోటా నేతలను మేపుతున్న పలు రాజకీయ పార్టీలు ఘోరంగా దెబ్బతిన్నాయి. మోదీ పార్టీకి ఎన్నికల్లో భారీ లబ్ధి చేకూరింది. డీమానిటైజేషన్ తర్వాత జరిగిన ఉత్తరప్రదేశ్, ఇతర ప్రాంతాల ఎన్నికల్లో డబ్బు ప్రవాహమైతే ఆగలేదు. కాకపోతే ప్రవాహమార్గాలు మారాయి. ఓటర్లకు డబ్బు పంపిణీ చేసే శక్తుల్ని, మార్గాల్ని దెబ్బతీయటంతోపాటు ఇకముందు కూడా ఓటర్లకు డబ్బుపంపిణీ వంటి చర్యలకు పాల్పడేవారి మీద కఠినచర్యలు తీసుకునేలా ప్రజాప్రాతినిధ్య చట్టాన్ని సవరించాలని కేంద్రం భావిస్తున్నట్టు వార్తలస్తున్నాయి. కానీ దీనివల్ల ఓటర్లకు ప్రలోభాలు, వేధింపులు లేకుండా ఇక ముందు ఎన్నికలు సక్రమంగా జరిగి ప్రజాస్వామ్యం బాగుపడుతుందా? అంటే.. ఆ అవకాశం కనిపించటం లేదు. పార్టీల నిధుల సేకరణకు బాండ్లులాగా ఇది కూడా మేడిపండు చర్యే. మనదేశంలో పార్టీల ప్రాపకంతో ఎదిగిన చోటామోటా నేతలు క్రమంగా ఆ పార్టీలనే శాసించే స్థాయికి ఎదగటం కనిపిస్తుంది. పేదరికం, అవిద్య, కులాలు, ఉపకులాలు, మతాలు, భాషలు వంటి సంక్లిష్ట భిన్నత్వం నేపథ్యంలో ఒక్క ఓటు తక్కువ వచ్చినా ఓడిపోయినట్టే అనే ఎఫ్‌పీటీపీ ఎన్నికల వ్యవస్థలో ఇలాంటి నాయకులు ఎదగటంలో పెద్ద ఆశ్చర్యమేమీ లేదు. అలాంటి నాయకులను తమ వైపు తిప్పుకోవటం ద్వారా, అవసరమైతే కొనుగోలు చేయటం ద్వారా ఎన్నికల్లో పెద్దగా డబ్బు పంచాల్సిన అవసరం లేకుండా చేయాలనే ఆలోచన పాలకుల్లో కనిపిస్తోంది. అందుకే ఎన్ని రాజకీయ నీతుల్ని చెబుతున్నా.. కాంగ్రెస్‌లాగే పెద్దఎత్తున ప్రజాప్రతినిధుల ఫిరాయింపుల్ని మోదీ పార్టీ కూడా ప్రోత్సహిస్తోంది. తెలుగునాట ప్రాంతీయ పార్టీలు కూడా ఈ సమీకరణాన్నే అనుకరిస్తున్నాయి. ఎన్నికల్లో పోటీ చేసే బలమైన అభ్యర్థుల్లో ఎక్కువమంది మనవాళ్లే కావాలి, మిగిలిన పార్టీలవారు డబ్బు పంపిణీ చేసే అవకాశం ఉండకూడదు అంటే పైకి ఎన్నికల సంస్కరణలా కనిపిస్తుంది కానీ, జరిగేది విరుద్ధంగా ఉంటుంది. ఈ నేతలు గెలుపు కోసం పోరాటంలోనూ, గెలిచాకా ప్రజల అవసరాలను తీర్చే క్రమంలో అధికార యంత్రాంగాన్నే ఉపయోగించుకుంటారు. అధికారులు యధావిధిగా ప్రజల్ని లంచాలతో దోచేస్తూ లైసెన్స్‌రాజ్ వ్యవస్థను కొనసాగిస్తారు. స్థానికంగా బలమైన నేతలతోపాటు అధికార యంత్రాంగాన్ని కూడా మచ్చిక చేసుకునేందుకు మోదీ ప్రభుత్వం గట్టిగా ప్రయత్నిస్తుండటం ఇక్కడ గమనార్హం. ఓ చిన్న సర్టిఫికెట్ కోసం సామాన్య ప్రజలు గతి లేక యాభయ్యో, వందో లంచమిచ్చినా వారికి జైలుశిక్ష, లంచం తీసుకున్న అధికారిని మాత్రం ప్రభుత్వ అనుమతి లేకుండా విచారణ కూడా చేయకూడదు వంటి చట్టసవరణల్ని కేంద్రం చేస్తోంది. ఈ ప్రయత్నాలన్నిటినీ రాజ్యాంగం పరిధిలోనే మోదీ ప్రభుత్వం చేస్తోంది. కానీ రాజ్యాంగాన్ని తయారుచేసుకున్నది ఇలా సాంకేతిక ప్రక్రియగా ఉపయోగించుకోవటం, ప్రమాణస్వీకారాల కోసమేనా? రాజకీయ వ్యవస్థలో పరివర్తన తెచ్చేందుకు రాజ్యాంగం ఉపయోగపడలేకపోతే.. దానికి, చిత్తుకాగితానికి పెద్ద తేడా ఉండదు. ఇప్పుడున్న స్థితి నుంచి మెరుగైన స్థితికి దేశాన్ని నడిపించేందుకు సాధనంగా రాజ్యాంగాన్ని వినియోగించకుండా కేవలం ప్రక్రియకు దాన్ని పరిమితం చేస్తే.. ఎవరు ఎన్నికవుతారన్నది పెద్ద అంశం కూడా అవదు, సానుకూల ఓటుకు సైతం విలువుండదు. ఏటా నవంబర్ 26న నిర్వహిస్తున్న రాజ్యాంగ దినోత్సవం తంతుగా మిగిలిపోతుంది. ప్రచ్ఛన్న ప్రభుత్వంలా వ్యవహరించే బలమైన ప్రజాప్రతినిధులు, జవాబుదారీతనంలేని అధికారయంత్రాంగంతో దేశ ప్రజలను కట్టుబాటులో నడిపించాలని, అప్పుడు గొప్ప భారతదేశం ఆవిష్కృతమవుతుందని కేంద్రం భావిస్తే.. కమ్యూనిస్టుల మూర్ఖత్వంలా వైఫల్యమే అవుతుంది. విద్య, ఆరోగ్యం, ఉపాధి, చట్టబద్ధపాలన, లంచాల్లేని సేవలు, స్థానిక ప్రభుత్వాల సాధికారత, లాభసాటి వ్యవసాయం, రాష్ట్రాల్లో ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక వంటి మార్పుల కోసం సంస్కరణలు తెచ్చినప్పుడే ప్రజలు స్వేచ్ఛగా సృజనాత్మకతతో ఆలోచించగలుగుతారు, వివక్ష లేకుండా ఎదగగలుగుతారు, రాజ్యాంగం సజీవ పరివర్తనాపత్రమవుతుంది. పారిశ్రామిక విప్లవకాలంలో బ్రిటన్ 1శాతం అభివృద్ధి రేటును సాధిస్తే చాలా గొప్పగా చూశారు. కానీ ఈవేళ మనదేశం 5.7శాతం సాధిస్తోంది అంటే పెదవి విరుస్తున్నారు. ఆ దేశాల్లోలా మార్పు కోసం శతాబ్దాలు వేచిచూసే వెసులుబాటు భారత్‌కి లేదు. పార్టీకన్నా దేశం మిన్న అనే సురాజ్య నినాదాన్ని పాలకులు ఉపన్యాసాల్లో కాకుండా ఆచరణలో చూపాలి.






# ఆ దేశాల్లో మామూలుగా అయ్యే పనులకు మనదేశంలో మాత్రం ఉద్యమాలు, ప్రెస్‌మీట్లు

చట్టం ఉండాలని, పార్లమెంటరీ కమిటీ ఆహ్వానం మేరకు తానే ఈ చట్టాన్ని తయారుచేసి అందించానని, ఇప్పుడు ఆ చట్టాన్ని పక్కనపెట్టి ప్రజలను వేధిస్తూ అధికారులను కాపాడే చట్టాన్ని పైకి తెచ్చారని అన్నారు. ఇప్పుడు ఇదే తరహాలో రాజస్థాన్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని, అవినీతిపరులపై మీడియా రాసినా కూడా జైల్లో పెడతామంటున్నారని అన్నారు. అవినీతిపరులైన అధికారులను ప్రాసిక్యూట్ చేయకుండా ప్రభుత్వాలు అడ్డుకోవటమే ఇప్పటిదాకా సమస్యగా ఉందని..

దేశంలో అవినీతిని రూపుమాపుతామని గద్దెనెక్కిన వారు నేడు అవినీతిని రక్షించేలా చట్టాలు తీసుకొస్తున్నారని, దీనిపై ప్రజలు, పౌరసమాజం, మీడియా అప్రమత్తంగా వ్యవహరించాలని జేపీ హెచ్చరించారు. గతి లేక ఓ చిన్న సర్టిఫికెట్ కోసమో, కుళాయి కనెక్షన్ కోసమో ప్రజలు లంచం ఇస్తే, ఆ ఇచ్చిన వారికి 3నుంచి 7ఏళ్ల వరకు జైలుశిక్ష విధించాలని, మరోవైపు లంచం తీసుకున్న అధికారిపై ఆరోపణలను విచారించాలంటే మాత్రం ప్రభుత్వ అనుమతి ఉండాలని కేంద్రప్రభుత్వం చట్టం రూపొందించిందన్నారు. దీనికి వ్యతిరేకంగా పార్లమెంటరీ కమిటీ ముందు తాను గళం విప్పానని, ఇది ఎంత అనాలోచిత చర్యో వివరించానని, అయితే తన గొంతు చాలలేదని అన్నారు. గవర్నమెంట్ ఆఫీసుల్లో లంచం ఇవ్వకుండా పనిచేయించుకున్నవారు మనందరిలో బహుతక్కువని, బలమైన రికమండేషన్ ఉంటే తప్ప లంచం, వేధింపులు లేకుండా పనులు చేయించుకోగలమని అన్నారు. ఇటీవల జరిపిన ఓ సర్వేలో దేశంలోని 65శాతం గృహాల్లో ఎవరోకరు ఏదోకసమయంలో లంచం ఇచ్చినట్టు చెప్పారన్నారు. అటువంటి దేశంలో లంచం లేకుండా నిర్ణీత గడువులోగా సేవలందించేందుకు పౌర సేవల ఇప్పుడు ప్రాసిక్యూషన్ అలా ఉంచితే కనీసం కానిస్టేబుల్ స్థాయి విచారణ కూడా చేయకూడదని చట్టం చేస్తున్నారన్నారు. అవినీతి ఆరోపణలపై విచారణకు వచ్చే కేసులే తక్కువని, వాటిలో ప్రాసిక్యూషన్‌కు అనుమతులు దాదాపు ఉండవని అన్నారు. తెలుగు రాష్ట్రాల్లోనే ముఖ్యమంత్రులు అనేకమంది అధికారులపై విచారణను తొక్కిపట్టారన్నారు. ఇప్పుడు అసలు విచారణ దశలోనే అధికారులకు రక్షణ కల్పిస్తే ఇక అవినీతిపై పోరుకు

### మన ఎన్నికలు మహామాయ

2019 ఎన్నికల్లో లోక్‌సత్తా పోటీ చేస్తుందా అన్న ప్రశ్నకు జేపీ సమాధానమిస్తూ.. "మన ఎన్నికలు మహామాయ. చిత్తూరులోగానీ, మదనపల్లిలోగానీ, తిరుపతిలోగానీ ఎవరు ఏ పార్టీలో ఉంటారో మీరు చెప్పగలరా? గత ఎన్నికల్లో ఇక్కడ అసెంబ్లీకి రూ. 20-25 కోట్లు ఖర్చు పెట్టినట్టు చెబుతున్నారు. ఈ మాత్రానికి ఎన్నికలు ఎందుకు? అయినా ప్రజాస్వామ్యానికి ప్రత్యామ్నాయం లేదని లోక్‌సత్తా భావిస్తుంది. అందుకే సంస్కరణల కోసం కృషి చేస్తోంది. ఎన్నికల సంస్కరణలు వచ్చేలోగా కనీసం పాలనలో కొన్ని, పెద్దగా ఖర్చులేని అంశాలను బాగు చేయాలనే సురాజ్య యాత్ర చేస్తున్నాం. ఎన్నికల వ్యవస్థ బాగా లేదు కాబట్టి పాలన పట్టించుకోనక్కర్లేదనుకుంటే ప్రజలు మరింతగా నష్టపోతారు. ఒక్క సీటు కూడా లేకుండా 3 కీలక రాజ్యాంగ సవరణల్ని, 5,6 చట్టాల్ని, పలు విధానపరమైన మార్పుల్ని సాధించాం. లోక్‌సత్తాకు ప్రజల నుంచి ఓ 10శాతం ఓట్లు వచ్చి ఉంటే, రాజకీయాల్లో చాలా మార్పుల్ని సాధించి చూపేవారం. కొన్ని నగరాల్లో కాస్త ఓట్లు కనిపించాయిగానీ, గ్రామాల్లో, సెమీ అర్బన్‌లో తగినంత బలం కనిపించలేదు. అందుకే ఎన్నికలకు విరామం ప్రకటించాం" అన్నారు.

అర్థమే ఉండదన్నారు. జాతీయ స్థాయి నుంచి జరుగుతున్న ఈ పరిణామాల్ని జాగ్రత్తగా అర్థం చేసుకోవాలన్నారు.

చిత్తూరు జిల్లాలో జనం కోసం జేపీ సురాజ్య యాత్రను ప్రారంభిస్తున్న సందర్భంగా వివరాలను తిరుపతిలో జయప్రకాష్ నారాయణ్ మీడియాకు తెలిపారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు హక్కుగా సేవలందించటమనేది చెప్పుకోదగిన ప్రతి దేశంలో చాలా సాధారణ విషయమని, మనదేశంలో మాత్రమే ఇందుకోసం ఉద్యమాలు, ప్రెస్‌మీట్లు అవసరమవుతున్నాయని జేపీ అన్నారు. ప్రజలకు గవర్నమెంట్ ఆఫీసుల్లో లంచాలు, దేబిరింపులు లేకుండా పనులు జరిగేందుకు పౌర సేవల చట్టం వంటి ఏర్పాట్లు తేవాలన్నది సురాజ్య ఉద్యమ లక్ష్యాల్లో ఒకటని చెప్పారు. దీంతోపాటు ప్రజలు ఎదిగేందుకు అనివార్యంగా కావలసిన విద్య, ఆరోగ్యం రంగాలను బాగుచేయటం, వ్యవసాయంలో ఆదాయం పెంచటం, ప్రజలు పాలనలో భాగస్వాములై తాము కట్టే పన్నుల డబ్బును సద్వినియోగం చేసుకునేందుకు కావలసిన స్థానిక సాధికారతను సాధించటం, చట్టబద్ధపాలన అమలయ్యేలా చూడటం సురాజ్య లక్ష్యాలన్నారు. కేంద్రం నుంచి రాష్ట్రాలకు 51శాతం బడ్జెట్ నిధులస్తున్నాయని, ఈ లెక్కన కేంద్ర బడ్జెట్ రూ.21,46,000 కోట్లలో రూ.10 లక్షల 85వేల కోట్లు రాష్ట్రాలకు వస్తోందని అన్నారు. కానీ ఈ డబ్బులో 10శాతం కూడా దిగువన ఉన్న స్థానిక ప్రభుత్వాలకు చేరటం లేదని అన్నారు. కేంద్రం నుంచి వస్తున్న నిధుల్లో 50శాతం దాకా స్థానిక ప్రభుత్వాలకు ఇవ్వాలన్నారు. ఇంత స్థాయిలో వెంటనే ఇవ్వలేకపోతే దశలవారీగా ఇవ్వొచ్చన్నారు. అప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఒక్కో విద్యార్థి మీదా రూ.60వేలు ఖర్చు చేస్తున్నా స్కూలు చదువు ఏపీలో అధ్వాన్నంగా ఉందని, ఇంతకంటే తక్కువ ఖర్చుతో చదువు చెప్పే కొన్ని గురుకుల, ప్రైవేటు పాఠశాలల్లో మెరుగ్గా ఉందని, దీనిపై లోతైన చర్చ జరిగి పరిష్కారాలు రూపొందించాలన్నారు. తన వంతుగా ఇప్పటికే ప్రభుత్వానికి లిఖితపూర్వకంగా లోపాల్ని, పరిష్కారాల్ని పంపానని, ఎక్కడా గాలిమాటలు చెప్పటం లేదని అన్నారు. ప్రజల ముందు వాస్తవాలు పెట్టి, వారి అభిప్రాయాలనూ కలుపుకుంటూ ఈ మార్పుల్ని సాధించేందుకే సురాజ్య యాత్ర చేస్తున్నానన్నారు. ఏపీలో 8వ తరగతి చదువుకుంటున్న పిల్లల్లో కనీసం చదవడం రానివారున్నారని, రెండంకెల తీసివేత చేయలేనివారు 30-40శాతం, ఓ చిన్న భాగాహారం కూడా చేయలేనివారు 55శాతం ఉన్నారన్నారు. భాగాహారం ఎందుకు

## సురాజ్య ఎజెండాకు మద్దతిచ్చిన పార్టీలకు ఓటు వేయమని చెప్పటానికి సందేహించను

సురాజ్య ఎజెండాకు మద్దతిచ్చే పార్టీలకు తన విశ్వసనీయతను ఫణంగా పెట్టి మరీ మద్దతివ్వటానికి వెనుకాడనని జేపీ ప్రకటించారు. ఆ పార్టీలు ఒట్టి హామీలిస్తే చాలా? అని అడగ్గా.. తెలుగు రాష్ట్రాల్లో, దేశంలో పార్టీలు అన్ని హామీల్నీ ఇచ్చేశాయని, స్పష్టమైన విధానాలు కావాలని అన్నారు. ఏ హామీ ఆచరణాత్మకమో, ఎవరేమిటో గత 40 ఏళ్లకు పైగా ప్రజాజీవితంలో, అధ్యయనంలో ఉన్న తనకు గ్రహించే శక్తి ఉందన్నారు.

చేయాలి అనే స్థాయిలో కూడా వీరి చదువుల నాణ్యతను ప్రశ్నించటం లేదని, కేవలం భాగాహార ప్రక్రియను చేయమన్నా చేయలేకపోతున్నారని అన్నారు. ఇలాంటి చదువులు చదివిన వారికి ఉపాధి ఎలా చూపుతారని ప్రశ్నించారు. ఏపీలో 38 లక్షలమంది పిల్లలు ప్రభుత్వ స్కూళ్లలో చదువుతున్నారని, వీరిలో అత్యధికులు పేద, అణగారిన వర్గాలకు చెందినవారని అన్నారు. దేశవ్యాప్తంగా ఏటా 1కోటీ 30లక్షలమంది కొత్తగా ఉద్యోగాల కోసం వస్తున్నారని, రేపు వీరికి ఉపాధి లేక కసితో, కోపంతో రోడ్ల మీదకు వస్తే సమాజం ఏమవుతుందో ఆలోచించారా? అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశాల్ని మీడియా ప్రజల దృష్టికి హత్తుకునేలా తీసుకెళ్లాలని కోరారు. సురాజ్య యాత్ర కవరేజీతోపాటు మౌలికమైన అంశాలను లోతుగా ప్రజలకు వివరించేందుకు కృషి చేయాలని, మేనేజ్‌మెంట్లు విధించిన పరిమితుల్లో కూడా మీడియా వారు ఈ పనిచేయవచ్చని అన్నారు. ఓ విషవలయంలో చిక్కుకున్నారేతప్ప మీడియా సంస్థల యజమానుల్లో, రాజకీయపార్టీల్లో అందరూ చెడ్డవారు కారన్నారు. మీడియా కథనాల్లో పరిణతి ఉంటే సురాజ్య సాధన సులువవుతుందన్నారు.

యూత్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్, సిటిజన్స్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్‌లలో నమోదు కావటం ద్వారా సురాజ్య కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ తాము ఉన్న చోటు నుంచే పనిచేయవచ్చని జేపీ తెలిపారు.

లోక్‌సత్తా 2.0 ఉద్యమ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ కన్వీనర్ బండారు రామ్మోహనరావు, లోక్‌సత్తా పార్టీ ఏపీ ప్రధాన కార్యదర్శి బాలసుబ్రమణ్యం, తిరుపతి నగర అధ్యక్షుడు బెల్లంకొండ సురేష్, వైబీఐ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు. ✦

# గత మూడేళ్లలోనే పాలకుల విధానాలు రైతులకు చేసిన నష్టం: రూ. 4,00,000 కోట్లు!

- మార్కెట్లో ధరలు పెరిగాయని ఆత్మహత్యలు చేసుకున్నవారు లేరు,
- పంటలకు ధరలు రావటం లేదని రైతులు మాత్రం ఆత్మహత్యలు చేసుకుంటున్నారు
- ప్రభుత్వాల కుట్రపూరిత విధానాల వల్లే ఇదంతా



మార్కెట్‌లో ధరలు పెరిగాయని మనదేశంలో ఆత్మహత్యలు చేసుకున్నవారు లేరని, కానీ కష్టపడి పండించిన పంటలకు ధరలు రావటం లేదని రైతులు మాత్రం ఆత్మహత్యలు చేసుకుంటున్నారని జేపీ అన్నారు. ఇది ప్రకృతి శాపం కాదు, పాలకుల పాపమేనన్నారు.


చిత్తూరు జిల్లా సురాజ్య యాత్రలో జేపీ మదనపల్లె నీరుగట్టువారిపల్లె వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించారు. టమాటా రైతులు, వ్యాపారులతో మాట్లాడి సమస్యలు, ఇతర వివరాలు తెలుసుకున్నారు. ఆన్‌లైన్ ద్వారా టమాటా కొనుగోలును ఈ-నామ్ కార్యాలయంలో పరిశీలించారు. కార్యదర్శి సుబ్బరాఘవరాజునడిగి వసతులు, సరకు లావాదేవీల గురించి తెలుసుకున్నారు.

అనంతరం జేపీ మాట్లాడుతూ, పార్టీలకతీతంగా నిర్వహిస్తున్న సురాజ్య యాత్రలో ఎంచుకున్న ఆరు లక్ష్యాలలో రైతులకు లాభసాటి ధరలు వచ్చేలా చేయటం కీలకమైనదన్నారు. ప్రకృతి వైపరీత్యాలను మన రైతులు తట్టుకోగలరని, అయితే పాలకులు అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాల వల్ల వారు నానాటికీ కుంగిపోతున్నారని అన్నారు. రైతు ఆత్మహత్యలు పాలకులు చేస్తున్న నేరాలేనన్నారు. రైతులకు ధర రాకుండా కృత్రిమంగా అణగదొక్కటం, ఇంకొన్ని సందర్భాల్లో రైతుకు ధర వచ్చే అవకాశమున్నా అందుకోసం ఎటువంటి ప్రయత్నం చేయకపోవటం.. ఈ రెండు రకాలుగా పాలకులు రైతులను దెబ్బతీస్తున్నారన్నారు. ఇందుకు కొన్ని స్పష్టమైన ఉదాహరణలను ఆయన వివరించారు.

గత మూడేళ్లలోనే కేవలం పాలకుల తప్పుడు విధానాల వల్ల దేశంలోని రైతులకు సుమారు రూ. 4,00,000 కోట్ల మేర నష్టం వాటిల్లిందని జేపీ తెలిపారు. ఏటా మనకున్న ఎగుమతులు రూ. 70,000 కోట్లు తగ్గేలా, సుంకంలేని దిగుమతులు దాదాపు అంతే స్థాయిలో మరో రూ. 75,000 కోట్లు పెరిగేలా పాలకులు వ్యవహరించారన్నారు. ప్రపంచం లోనే అత్యధికంగా మనదేశం వంటనూనెల్ని, పప్పుదినుసుల్ని దిగుమతి చేసుకోంటోందని, మన రైతులు కందులు, పెసలు, నువ్వులు, వేరుసెనగ పండించే సామర్థ్యం ఉన్నవారైనా దిగుమతులు చేసుకుని మాత్రమే దేశావసరాలను తీర్చేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. వినియోగదారులకు మార్కెట్లో తక్కువ ధరకు వంటనూనెలు అందించాలన్న ఆలోచన తప్పితే, ఆ దిగుమతుల మీద సుంకం విధించి ఆ డబ్బును రైతులకు ప్రోత్సాహకాలుగా ఇస్తే మనదేశం స్వయం సమృద్ధ మవటంతోపాటు రైతులకు కూడా మంచి ఆదాయం వస్తుందని, విని యోగదారులకూ లాభం జరుగుతుందని పాలకులు ఆలో చించటం లేదన్నారు. ఏటా దాదాపు రూ. 1లక్ష కోట్ల మేర దిగుమతి చేసుకుంటున్న వంటనూనెల మీద చాలా తక్కువ సుంకం ఉందని, వంటనూనె లను రిఫైన్ చేసే పరిశ్రమల కోసమే ఆ మాత్రం సుంకమైనా ఉంది తప్ప రైతుల కోసం కాదన్నారు. పప్పుధాన్యాల మీద దాదాపు సుంకమే లేదన్నారు. ఆ దిగుమతుల మీద 40శాతం సుంకం

## రైతుకి ధర లేకపోతే తొంగి కూడా చూడరయ్యా

టమాటా ధరలు పెరిగితే అధికారులు మార్కెట్‌కు వస్తారే తప్ప.. ధరలు పతనమైతే ఒక్కరూ ఇటు చూడరయ్యా.. అని ఒక రైతు మదనపల్లె వ్యవసాయ మార్కెట్‌లో జేపీ వద్ద గోడు వెళ్లబోసుకున్నాడు. ఇది పూర్తిగా వాస్తవమని జేపీ అన్నారు. వినియోగదారులు కాస్త నోరున్నవారు, ప్రశ్నించగలిగినవారు కావడం, రైతులు అమాయకులు, తమ ప్రయోజనమేమిటో తెలియనివారు కావడం వల్ల.. వినియోగదారులకు తక్కువ ధరకు అందించటం కోసం స్వదేశంలో 50శాతానికి పైగా జనాభాగా ఉన్న రైతులనే దగా చేసేందుకు ప్రభుత్వాలు వెనకడాటం లేదని జేపీ అన్నారు. తాను అసెంబ్లీలోకి వెళ్లకముందు అన్ని పార్టీలు కూరగాయల ధరలు పెరిగితే, మెడలో కాయగూరల దండలు వేసుకుని ప్రదర్శనలు చేసేవారని, ఈ ధోరణి మానుకోకపోతే బహిరంగంగానే మీకు వ్యతిరేకంగా రైతుల్లో ప్రచారం చేస్తాననని హెచ్చరించటంతో అప్పట్నుంచి ఆ పని మానుకున్నారన్నారు. రైతుకు ధర రాకపోతే మొసలి కన్నీరు, నోరున్న వినియోగదారుల కోసం మాత్రం వెంటనే చర్యలు రాజకీయమే వ్యవసాయం పాలిట శాపంగా మారిందన్నారు. దళారీ వ్యవస్థను కుదిస్తే, అటు రైతుకు, ఇటు వినియోగదారుడికి లాభం చేకూర్చే విధానాలున్నా ప్రభుత్వాలు, కొన్ని పార్టీలకు అది ఇష్టం లేదన్నారు. రైతులను ఓటుబ్యాంకులుగా, జెండాలు మోసేవారిగానే వాడుకోవాలని చూస్తున్నారన్నారు.




వేస్తే రూ. 40,000 కోట్లు వస్తాయని, ఆ డబ్బునే రైతులకు ప్రోత్సాహకాలుగా ఇస్తే మన కర్షకులు అద్భుతాలు సృష్టిస్తారన్నారు. సమృద్ధిగా వ్యవసాయ సామర్థ్యం ఉన్న దేశంలో ఇలా వ్యవసాయోత్పత్తుల్నే దిగుమతి చేసుకోవడం ఏ దేశంలోనూ జరగదని, ఈ విషయం చెబితే విదేశాల్లో నమ్మనుకూడా నమ్మరని, కానీ మనదేశంలో మాత్రం దౌర్భాగ్యపు పాలనతో ఇలా రైతులను దెబ్బతీసే ఎగుమతి–దిగుమతి విధానాన్ని అనుసరిస్తున్నారని అన్నారు.

అలాగే 2011లో పొరుగున ఉన్న మహారాష్ట్ర, కర్ణాటకలో ధాన్యానికి మన రాష్ట్రంలో కంటే ఎక్కువ రేటు ఉందని, కానీ మన రాష్ట్ర ప్రభుత్వం ఎక్కడ రేటుంటే అక్కడ అమ్మటాన్ని ప్రోత్సహించి రైతులకు మేలు చేసే ప్రయత్నం చేయాల్సింది పోయి.. పొరుగు రాష్ట్రాల్లో ధాన్యం అమ్మకోకూడదని నిషేధించిందని జేపీ అన్నారు. దీనికి వ్యతిరేకంగానే రైతు సంఘాలు, ఇతర మిత్రులతో కలిసి తాను కర్నూలు నుంచి కర్ణాటకకు, నిజామాబాద్ నుంచి మహారాష్ట్రకు చిన్న ధాన్యం మూటలతో యాత్ర చేసి అమ్మామని, దమ్ముంటే అరెస్టు చేయమని సవాలు చేశామని అన్నారు. చివరకు ప్రభుత్వం వెనక్కి తగ్గి ఆంక్షలను ఎత్తివేసిందన్నారు. దీంతో ధాన్యం రేటు ఈ రాష్ట్రంలో కూడా పెరిగిందని, తెలంగాణ, కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లోని రైతులకు ఒక్క బీపీటీ వెరైటీ ధాన్యానికి ఒక్క సీజన్‌లోనే రూ. 3,600కోట్ల మేర లబ్ధి కలిగిందని అన్నారు.

ఇదే తరహాలో ఆ సమయంలో విదేశాల్లో కూడా బియ్యానికి డిమాండ్ ఉందని జేపీ తెలిపారు. అయినా యూపీయే ప్రభుత్వం ఎగుమతులపై మూర్ఖంగా నిషేధం విధించిందన్నారు. దీనిపైన అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని పార్టీలన్నిటినీ, కేంద్రంలోని వారినీ ఒప్పించి, 2011, ఏప్రిల్ 27న ప్రధానమంత్రితో కూర్చుని గట్టిగా వాదనలు వినిపించానన్నారు. "దేశంలో 8కోట్ల టన్నుల ఆహారధాన్యాల నిల్వలు మూలుగుతుంటే, పందికొక్కులు తింటూ వానలకు తడుస్తుంటే, రైతులకు ధర పెరగకుండా ఎందుకు ఎగుమతుల్ని నిషేధించారు? అని హేతుబద్ధంగా వివరాలతో ప్రశ్నించేసరికి ప్రధాని కూడా ఏమీ మాట్లాడలేకపోయారు. చివరికి ఎగుమతులపై నిషేధం తొలగించారు. అప్పటి నుంచీ ఇప్పటివరకూ బియ్యం ఎగుమతుల్లో భారతదేశంలో ప్రపంచంలోనే నెంబర్‌వన్‌గా ఉంటూ వస్తోంది. రైతులకు, విదేశీ మారకద్రవ్యం రూపంలో దేశ ఖజానాకు కూడా ఆదాయం తెస్తోంది" అని జేపీ వివరించారు.

దేశ జనాభాలో ఇప్పటికీ 50శాతం పైన వ్యవసాయం మీద ఆధారపడి ఉన్నారని, వారి ఆదాయం మాత్రం దేశ ఆదాయంలో 14శాతం మాత్రమే ఉందని జేపీ అన్నారు. దేశంలోని సగానికిపైగా ప్రజలకు ఇంత తక్కువ ఆదాయం ఉంటే, మిగిలినవారు

### సహకార సంఘాలు, రిటైల్ చెయిన్స్‌తో నూటికి రూ.70దాకా రైతుకు వస్తుంది

రాష్ట్రంలో రైతుల సంక్షేమానికి ఎంతో ఉపయోగపడే 'మ్యాక్స్' (పరస్పర సహాయసహకార సంఘం) చట్టాన్ని ఎన్టీరామారావు తీసుకొచ్చారని, ఆ తర్వాత ఆ చట్టాన్ని దెబ్బతీయకుండా తాను జాతీయ సలహామండలిలో ఉన్నప్పుడు సహకార సంఘం ఏర్పాటును హక్కుగా చేస్తూ రాజ్యాంగ సవరణ (97)ను సాధించానని జేపీ వివరించారు. ఈ సహకార సంఘాల వల్ల మదనపల్లె, ఇతర ప్రాంతాల టమాటా రైతులకు కూడా లాభం చేకూరుతుందన్నారు. టమాటా నిల్వ ఉండే పంటకాదని, దీనికి శీతల గిడ్డంగుల ఏర్పాటు కూడా పరిష్కారం కాకపోవచ్చని, ప్రాసెసింగ్ గుజ్జు వల్లే ఎక్కువ లాభమని అన్నారు. ఈ ప్రాసెసింగ్‌ను రైతులు సహకార పద్ధతిలో ఏర్పాటు చేసుకుంటే, ఎంత డిమాండ్‌లేని పరిస్థితుల్లోనైనా కిలోకు రూ.ఏడెనిమిది రూపాయలకంటే రేటు తగ్గదన్నారు. ఇప్పటిలా రూపాయి కూడా ధర పలకని పరిస్థితుల్లో రోడ్ల మీద పారబోయాల్సిన అవసరం ఉండదన్నారు. ఇంకా లాభాలస్తే రైతులకే పంచవచ్చన్నారు. మ్యాక్స్ చట్టం ద్వారా ఏర్పడిన కృష్ణా, కరీంనగర్, నల్గండ, గుంటూరు, విశాఖ డెయిరీ వంటివి అలా లాభాల్ని రైతులకు పంచుతున్నాయన్నారు. ప్రస్తుతం వినియోగదారుడు రూ.100కు కొనే పంటకు రైతుకు రూ.30 మాత్రమే వస్తోందన్నారు. పటిష్ట సహకార సంఘాలు, రిటైల్ చెయిన్స్ పెద్దఎత్తున వస్తే, దళారీ వ్యవస్థ పోయి వినియోగదారుడు రూ.100కి కొనే పంటకు రైతుకు రూ.70దాకా వస్తుందన్నారు.



86శాతం ఆదాయం పొందుతున్నారన్నారు. వర్షాల మీదే ఆధారపడి తక్కువ డిమాండ్ ఉన్న పంటలను పండించే రైతులకు ఇంకా తక్కువ ఆదాయం వస్తుందన్నారు. ఇంత తీవ్రమైన ఆదాయ అసమానతలు అమానుషం, మున్ముందు ప్రమాదకరం అన్న ఆవేదన, ఆలోచన కూడా పాలకుల్లో కనిపించటం లేదన్నారు. రైతులకు పాలకులు ఏ రాయితీ ఇవ్వకపోయినా వారికి మార్కెట్ స్వేచ్ఛనిచ్చినా ఇప్పుడున్న ధరల కంటే మంచి రేట్లు వస్తాయన్నారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రైతుల నుంచి ఏటా వివిధ రూపాల్లో రూ.2,500కోట్లు పన్నుల రూపంలో వసూలు చేశారని, ఇప్పుడు కూడా ఏదోకరూపంలో రెండు రాష్ట్రాలూ ఆ వసూళ్లు చేస్తున్నాయని, కానీ ఆ డబ్బును రైతులకు రేట్లు పెరిగేందుకు ఉపయోగించటం లేదని జేపీ అన్నారు. మార్కెట్ యార్డుల్ని రాజకీయమయం చేశారన్నారు.

సురాజ్య యాత్ర లక్ష్యాల్లోని నాణ్యమైన విద్య, ఆరోగ్యం, ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాల్లేని సేవలు, స్థానికంగా నిధులు, చట్టబద్ధపాలన కూడా రైతుల సంక్షేమానికి దోహదం చేసేవేనని జేపీ అన్నారు.

లోక్‌సత్తా ఉద్యమ 2.0 తెలుగు రాష్ట్రాల కన్వీనర్ బందారు రామ్మోహనరావు, లోక్‌సత్తా పార్టీ ఏపీ ప్రధాన కార్యదర్శి, తంబళ్లపల్లె, మదనపల్లె నేతలు జయచంద్రారెడ్డి, శరవణ్‌కుమార్, సూర్యనారాయణ, వైబీఐ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. ✦

# జనం డబ్బు వృధా చేసే ధోరణుల్ని కేసీఆర్ మానుకోవాలి

ప్రజాధనాన్ని వృధా చేసే ధోరణులను ముఖ్యమంత్రి కేసీఆర్ మానుకోవాలని లోక్‌సత్తా పార్టీ తెలంగాణ అధ్యక్షుడు డా॥ పాండురంగారావు అన్నారు. బతుకమ్మ స్ఫూర్తిని పెంచేలా ఆరోగ్య విధానాలను తీసుకురాకుండా చీరలు పంచారని, దీనివల్ల చేనేతకు లాభం రాకపోగా కోట్ల రూపాయల జనం డబ్బు కరిగిపోయిందని అన్నారు. ప్రభుత్వం పంచిన చీరల్ని ప్లాస్టిక్ డబ్బాలకు అమ్ముకుంటున్నారన్నారు. జాగ్రత్తగా ఎదగాల్సిన రాష్ట్రంలో బాధ్యతగల ప్రభుత్వం చేయాల్సిన పనులు ఇలాగేనా ఉండాల్సింది? అని ప్రశ్నించారు. రాష్ట్రానికి కొత్త సచివాలయం, అసెంబ్లీ నిర్మాణ ప్రయత్నాల్ని కూడా విరమించుకోవాలని డిమాండ్ చేశారు. వీటితో కూడా ప్రజాధనం వృధా తప్ప ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ కొత్త అసెంబ్లీ, సచివాలయం నిర్మించుకుంటోందని తెలంగాణ ప్రభుత్వం కూడా అదే మార్గంలో ఆలోచించడం సమంజసం కాదన్నారు. వాస్తు పేరిట ఉన్న భవనాలను కూల్చివేస్తాననటం హాస్యాస్పదం, మూర్ఖత్వమన్నారు. తోటివారు తొడ కోసుకుంటే.. తాను మెడ కోసుకుంటానన్న చందంగా ముఖ్యమంత్రి వ్యవహరిస్తున్నారన్నారు. ఊకదంపుడు ఉపన్యాసాల్ని, పాత రాజకీయాన్ని దాటి ప్రజలకు నిర్మాణాత్మకంగా ఉపయోగపడే పనులకు జవాబుదారీతనంతో ప్రజాధనాన్ని ఉపయోగించాలన్నారు. ✦

# అట్టడుగు స్థాయిలో పన్నులు తప్ప నిధులేవీ?

ప్రభుత్వాల దృష్టికి రాజధానులు, పెద్ద నగరాలు తప్ప ఆనటం లేదని, కానీ ఇప్పటికీ అత్యధిక ప్రజలు నివసిస్తున్న గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల్ని అభివృద్ధి చేస్తేనే దేశాభివృద్ధి సాధ్యమని జేపీ అన్నారు.



అనంతపురం జిల్లా రాయదుర్గం సురాజ్య యాత్రలో భాగంగా జేపీ పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

మౌలిక వసతుల్ని, నిధుల్ని, అధికారాల్ని గ్రామాలకు వికేంద్రీకరించటం, పరిశ్రమల్ని స్థాపించటం, సేవల్ని ప్రోత్సహించటం చేస్తేనే దేశంలో సంపద పెరుగుతుందని, యువతకు ఉద్యోగాలు వస్తాయని వ్యవసాయంలో కనీస ఆదాయం లభిస్తుందని జేపీ అన్నారు. ఈ దిశగా పాలనను మార్చటానికి అవరోధాలేమీ లేవని, ప్రజలకు మేలు చేయాలని పాలకులకు కాస్త బుద్ధి, జ్ఞానం ఉంటే చాలని అన్నారు. చాలా తేలిగ్గా జనం జీవితాల్ని సమూలంగా మార్చేసే నమూనా ఇది అన్నారు. ఉపాధి లేక కోట్ల మంది అల్లాడుతుంటే, ఏటా 1కోటీ 30 లక్షలమంది యువత కొత్తగా వారికి జతవుతున్నారని, ఈ పరిస్థితిని ఎదుర్కోవడానికి ఎటువంటి పాలనా మార్పులు లేకుండా యథాతథస్థితిని కొనసాగిస్తున్నారని అన్నారు. ఇది పేలడానికి సిద్ధంగా ఉన్న పెద్ద సంక్షోభమని హెచ్చరించారు. ప్రజలకు ఊకదంపుడు ఉపన్యాసాలు, దేశభక్తి నినాదాలు ఇస్తే లాభం లేదని, వారికి దేశానికి మేలు చేసే కార్యక్రమాల ద్వారా ఎదిగే అవకాశాలు, మెరుగైన ఆదాయాన్ని సంపాదించుకునే అవకాశాలను అందించాలని అన్నారు.

దాదాపు పాతికేళ్ల క్రితం ఎన్టీరామారావు, బిజూపట్నాయక్, కరుణానిధి, రామకృష్ణ హెగ్డే, ఫరూక్ అబ్దుల్లా వంటి వారు చేసిన కృషి వల్ల ఇప్పుడు కేంద్రం నుంచి దాదాపు బడ్జెట్‌లో 51శాతం (పన్నుల డబ్బులో 67శాతం) రాష్ట్రాలకు వస్తోందని, కానీ ఆ డబ్బు నుంచి గ్రామాలకు వస్తున్నది మాత్రం బిచ్చమేసినట్టు విదిలింపులేనని జేపీ అన్నారు. పన్నుల రూపంలో కోట్ల రూపాయలను ప్రభుత్వానికి కడుతున్న గ్రామీణ ప్రజల సేవలకుగాను.. రూపాయికి 5పైసలు కూడా పంచాయతీలకు అందటం లేదన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి రోజుకు రూ. 11,000కోట్లు ప్రజల పేరు మీద ఖర్చు చేస్తున్నా, ఇప్పటికీ గ్రామాల్లో కనీస వసతులు అందటం లేదన్నారు. విద్య, ఆరోగ్యం వంటివి అత్యంత ఖరీదైన వ్యవహారాలన్నారు.

ఏపీ బడ్జెట్ రూ. 1,57,000 కోట్లలో ఒక్కో పౌరుని పేరు మీదా ఏటా రూ. 30,000 ఖర్చు చేస్తున్నారని, అందులో సగం స్థానికంగా ప్రజలుండే గ్రామాలు, పట్టణాలకు ఇవ్వాలని జేపీ డిమాండ్ చేశారు. ఈ లెక్కన 70వేల జనాభా ఉండే రాయదుర్గం పట్టణానికి ఏడాదికి ప్రభుత్వం రూ. 225 కోట్లు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఈ డబ్బు ఇక్కడే ఉంటే, ప్రజలు తమ రోజువారీ అవసరాలను ఎవరి దయాదాక్షిణ్యాల మీద ఆధారపడకుండానే వెంటనే తీర్చుకోగలుగుతారన్నారు. సరైన మౌలిక వసతులు, రోజువారీ సేవలు, విద్య, ఆరోగ్యం లేక, ఉపాధి లేక, సృష్టించుకునే శక్తి కొరవడి యువత రోజూ పొట్ట చేత పట్టుకుని గ్రామాల నుంచి వలసలు పోతున్నారన్నారు. ఇదంతా విధి రాతో, దేవుడు గీసిన గీతో కాదని, పాలకులు ఆడుతున్న నాటకమని అన్నారు. ఎగుమతుల్ని కుంగదీస్తూ, దిగుమతుల్ని సుంకం కూడా లేకుండా పెంచుతూ అనుసరిస్తున్న విధానం వల్ల వ్యవసాయరంగం గత మూడేళ్లలోనే లక్ష కోట్లకు పైగా నష్టపోయిందన్నారు. మన రైతుల్ని దెబ్బతీస్తూ, వలసదారులుగా మారుస్తూ విదేశాలకు మేలు చేసే విధానాలను పాలకులు అనుసరిస్తున్నారన్నారు. ప్రపంచమంతా ఆరోగ్యరంగానికి ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు పనిచేసే సామర్థ్యాన్నిస్తుంటే, మనదేశంలో ఆరోగ్యానికి నూటికి రూపాయి పదిపైసలు మాత్రమే కేటాయిస్తున్నారన్నారు. పేద, మధ్యతరగతి అప్పుల్లో కూరుకుపోవటానికి, దేశంలో పేదరికం దశాబ్దాలుగా కొనసాగుతుండటానికి వైద్య విధానం కూడా ప్రధాన కారణమన్నారు.

జీఎస్టీ విధానం లక్ష్యం మంచిదేనని, స్లాబ్‌లో పన్ను భారాన్ని తగ్గించి చెల్లింపు విధానాన్ని సరళతరం చేయాలని జేపీ అన్నారు. అన్నిటికన్నా పన్నుల డబ్బు సద్వినియోగం చేయటం కీలకమన్నారు.

ఇలా అన్ని ప్రధాన రంగాలలో ప్రభుత్వాలు అనుసరిస్తున్న అసంబద్ధ, ప్రజావ్యతిరేక విధానాలను చిన్న పరిష్కారాలతో, తక్కువ ఖర్చుతో సమూలంగా మార్చేందుకే సురాజ్య యాత్ర చేస్తున్నామన్నారు. ఈ పరిష్కారాల్లో అందరూ భాగస్వాము లవ్వాలని, యూత్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్, సిటిజన్స్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్‌లలో నమోదై సురాజ్య కార్యక్రమాల్లో దీర్ఘకాలంలోనూ భాగస్వాములవ్వాలని విజ్ఞప్తి చేశారు.

లోక్‌సత్తా నేతలు రామ్మోహనరావు, బాబ్జీ, వెంకట రమణబాబు, ఆనందాచారి, అంజినప్ప, సిద్ధప్ప, వైబీఐ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. ✦

# ఇవాళ కుంభవృష్టి.. రేపు మంచినీటికి కటకట! దీన్ని పాలన అంటారా?



రాయలసీమ జిల్లాల్లో కుంభవృష్టికి వాగులు వంకలు పొర్లి జనజీవనం అస్తవ్యస్తమటం చూస్తే చాలు దశాబ్దాలుగా మన పాలన ఎంత అధ్వాన్నంగా సాగుతోందో అర్థమవుతుందని జేపీ అన్నారు. కరవు ప్రాంతమైన అనంతపురం వంటి చోట్ల వర్షానికి కొన్ని జలాశయాలు నిండటం సంతోషకరమని, అయితే అనేక ప్రాంతాలు ముంపునకు గురయ్యాయని, ఇలాంటి ప్రాంతంలో కురిసిన ప్రతి నీటి బొట్టునూ ఒడిసిపట్టేందుకు ఏర్పాట్లు చేసిపెట్టుకోవాలన్న ఇంగితం కూడా పాలకుల్లో లోపించిందని అన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా అత్యధికంగా నిధుల్ని పొందిన రాష్ట్రం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అని, ఈ నిధుల్ని ప్రధానంగా మెట్ట ప్రాంతాల్లో జలవనరుల్ని పెంచేందుకు వినియోగించాలని తాను పలుమార్లు ప్రభుత్వాల్ని కోరానని తెలిపారు. సీహెచ్ హనుమంతరావు వంటి వారితో కలిసి ఢిల్లీలో పాలకుల్ని కలిసి వివరంగా చెప్పినా ఫలితం లేకపోయిందన్నారు. అసెంబ్లీలో కూడా తాను అనేక సందర్భాల్లో ఈ సూచనను డిమాండ్‌గా చేశానన్నారు. కేవలం కాస్త మంచి బుద్ధి తప్ప ఈ పనికి అదనంగా కావలసిందేమీ లేదన్నారు. అయినా ఇప్పటిదాకా పాలకులు చేయలేదన్నారు. తమకు ఎన్నికల్లో ఓట్లు వచ్చే అవకాశం లేని పనుల్ని చేసే పాలకులు దాదాపు కరవయ్యారన్నారు. ప్రజలు వాస్తవాల్ని అర్థం చేసుకుని, తమ అవసరాలకు తగ్గ విధానాలను తెలుసుకుని డిమాండ్లుగా మార్చుకుంటేనే మార్పులు వేగంగా వస్తాయన్నారు. ఈవేళ భారీవర్షాలు కురిసిన చోటే రేపు మంచినీటికి కటకట ఉంటుందని, దీన్నసలు పరిపాలన అంటారా? అని ప్రశ్నించారు. ✦

### మా ప్రధాని నిజాయతీపరుడని పదే పదే చెప్పుకోవాల్సి రావడం సిగ్గుచేటు

అధికారంలో వున్న వ్యక్తులు నిజాయతీపరులైతే సరిపోదని, ప్రధానమంత్రి మోదీ నిజాయతీపరుడని చెప్పుకోవాల్సి రావడం సిగ్గుచేటని జేపీ అన్నారు. ప్రధాని నిజాయతీగా ఉండటం కనీస అర్హతని, మా ప్రధాని నిజాయతీపరుడని పదే పదే ఎందుకు చెప్పుకోవాల్సి వస్తోందని అన్నారు. వ్యవస్థను నిజాయతీగా, సమర్థవంతంగా నడపటం కోసం ప్రధానిని ఎన్నుకుంటామన్నారు. అవినీతిని నిరోధించటంలో కావచ్చు, ఇతర పాలనా అంశాల్లో కావచ్చు.. ఆయన వ్యవస్థీకృత నిజాయతీని, సమర్థతను ప్రదర్శించలేకపోతున్నారన్నారు. అవినీతిపరులు ఆధునిక సాంకేతిక మార్గాల్లో యథావిధిగానే దోపిడీని కొనసాగిస్తున్నారన్నారు. ప్రజల రోజువారీ సమస్యలు అలాగే కొనసాగుతున్నాయన్నారు. రాష్ట్రంలోనే ఇదే ధోరణి కొనసాగుతోందన్నారు. ప్రభుత్వాలు తాత్కాలిక అవసరాల్ని దీర్ఘకాలిక ప్రయోజనాలతో సంధానం చేసి వ్యవస్థల్ని నిర్మించటంతోపాటు ప్రజలకు ఎక్కడికక్కడ వనరులను, నిధులను జవాబుదారీతనంతో అందించే ఏర్పాటు చేస్తే.. ప్రభుత్వ నిధులు సద్వినియోగమవుతాయి, నీటిఎద్దడి సహా పలు ప్రజాసమస్యలు పరిష్కారమవుతాయని అన్నారు. సంకల్పం ఉంటే ఇలా అదనపు నిధులు అవసరం లేకుండానే సురాజ్యం సాకారమవుతుందన్నారు.

## కౌలురైతుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

కౌలురైతుల సమస్యల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుండటంతో రాష్ట్రంలోని పేద, అణగారిన ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని లోక్‌సత్తా సీనియర్ నేత కె.సుధాకర్ అన్నారు. వ్యవసాయానికి ధరలు రాకుండా అణచివేయటం వల్ల ఎక్కువ నష్టపోతున్నది కూడా కౌలురైతులేనని విజయనగరంలో ఒక పత్రిక నిర్వహించిన సదస్సులో వివరించారు. వీరి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. కౌలురైతులు సంఘాలుగా ఏర్పడి రుణాలు, కార్డులు పొందేందుకు ఉద్యమించాలన్నారు. ✦

ప్రజలకన్నా ప్రైవేటు ఆస్పత్రులకు ఎక్కువ మేలు చేసే ఆరోగ్యశ్రీ వంటి సేవలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రబడ్జెట్‌లో రూ.2,000కోట్లదాకా కేటాయించిందని, 11 బోధనాస్పత్రులకు మాత్రం కనీస కేటాయింపులు లేవని డా॥ జేపీ అన్నారు. రాయలసీమలో అతిపెద్ద ప్రభుత్వాస్పత్రిగా ఉన్న తిరుపతి రుయాకు తక్కువలో తక్కువగా రూ.200 కోట్లు అవసరమైతే, కేవలం 65కోట్లు ఇస్తున్నారన్నారు. రుయాలో 750 పడకలుంటే 1100 మందికిపైగా రోగులకు సేవలందిస్తున్నారని,



# ప్రైవేటుకు వేల కోట్లు.. రాయలసీమ పెద్దాస్పత్రికి రూ.65కోట్లా?

రోజుకు ఓపీలో 2,000మందికిపైగా వైద్యం అందిస్తున్నారని అన్నారు. సర్జరీ విభాగం ద్వారా రోజుకు 50 నుంచి 60 మేజర్ సర్జరీలు, మరో 60 ఆప్తమాలజీ సర్జరీలు, 100 మైనర్ సర్జరీలు జరుగుతున్నాయన్నారు. 160మంది పీజీ విద్యార్థులతో ఆస్పత్రిని నెట్టుకొస్తున్నట్టు చెప్పారు. ఈ సేవలకు ప్రైవేటు రంగంలోని ఆస్పత్రులు చేసే ఖర్చులో కేవలం మూడో వంతుతో రుయాను నడుపుతున్నారన్నారు. ప్రజల జీవితాల్ని ఎంతగానో ప్రభావితం చేసే కీలకరంగం పట్ల, ప్రజలకు సేవలందించే తీరు పట్ల పాలకులకు ఎంత నిర్లక్ష్యమో ఈ అసంబద్ధ కేటాయింపులే చెబుతున్నాయన్నారు.

సురాజ్య యాత్రలో భాగంగా జేపీ తిరుపతి రుయా ఆస్పత్రిని సందర్శించారు. సూపరింటెండెంట్‌తోపాటు ఇతర అధికారులతో సమావేశమై రోగులకు అందుతున్న వైద్యం, సౌకర్యాలు, అభివృద్ధి, సమస్యలు, బడ్జెట్ తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం రుయా చిన్నపిల్లల ఆస్పత్రి వద్దకు వెళ్లి ఎన్ఐసియులో వైద్యసేవల్ని ఆరాతీశారు.

తిరుపతి రుయా బోధనాస్పత్రిలో ఒక రూపాయి ఖర్చుకి 3 నుంచి 4 రూపాయల ఫలితాల్ని సాధిస్తున్నారని, మరిన్ని నిధుల్ని వెచ్చించకపోటం బాధాకరమని జేపీ అన్నారు. కేవలం ఆరోగ్యానికి చేస్తున్న అప్పుల వల్ల ఏటా మనదేశంలో 6 కోట్ల మంది నిరుపేదలుగా మారుతున్నా ప్రభుత్వాలు తాత్కాలిక తాయిలాలకు–నిజమైన సంక్షేమానికి మధ్య తేడాని గుర్తించటం లేదన్నారు. ఐదేళ్ల లోపు ఉన్న పిల్లలు మనదేశంలో ఏడాదికి 12లక్షలమంది చనిపోతున్నారన్నారు. రోజుకు 3,500 మంది చనిపోతున్నా, వీరిలో ఎక్కువమందిని కాపాడగలిగే అవకాశమున్నా.. ప్రభుత్వం జాతీయదాయంలో కేవలం 1 శాతమే వెచ్చించటం అనాగరికమని ఆవేదన వ్యక్తం చేశారు. నిపుణుల స్థాయిలో వైద్యరంగాన్ని ప్రైవేటీకరించటం సరికాదన్నారు. తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్యాన్ని అందించే డాక్టర్లు భారతదేశానికే సొంతమన్నారు. వ్యాక్సిన్లు, ఔషధాల తయారీలో ప్రపంచదేశాలతో పోటీపడి చైనా కంటే ముందు నిలిచామన్నారు. తక్కువ ఖర్చుతోనే వాటిని తయారుచేస్తున్నామన్నారు.

జాతీయ ఆరోగ్య పథకం (ఎన్‌హెచ్‌ఎం) రూపశిల్పిగా వైద్యరంగం పట్ల తనకు అవగాహన ఉన్న నేపథ్యంలోనే ఇవన్నీ తెలియచేస్తున్నానని జేపీ వివరించారు. ప్రతి పౌరుడి ఆరోగ్యం కోసం పాటుపడుతున్న ఏఎన్‌ఎంలకు ఆరోగ్య భద్రతలేదని, ప్రసూతి సెలవలు ఇవ్వడం లేదని, రాష్ట్రంలో సగానికిపైగా ఏఎన్‌ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయని అన్నారు. బోధనాసుపత్రులకు నిధులు కేటాయించటంతోపాటు వీటిలో సేవల నాణ్యతను పెంచేందుకు ప్రాథమిక వైద్యకేంద్రాలను బలోపేతం చేయాలన్నారు. ప్రజలకు మంచి సేవలందించి ఓట్లు పొందే రాజకీయం చేయాలన్నారు. ఇందుకోసమే సురాజ్య యాత్రన్నారు.

రుయా సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధానాయక్, ఆర్ఎంవోలు డాక్టర్ మునిరత్నం, మార్కండేయశర్మ, శ్రీహరి, చిన్నపిల్లల విభాగాధిపతి డాక్టర్ రవికుమార్, కిరీటి, లోక్‌సత్తా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యం, బెల్లంకొండ సురేష్, నీలకంఠేశ్వర తదితర నేతలు పాల్గొన్నారు.

# ఇలాంటి కళాశాలలకన్నా జైళ్లే నయం..
# బాలికా విద్య పట్ల ఇంత నిర్లక్ష్యమా?





**లోక్‌సత్తా తరపున సదుపాయాలు కల్పిద్దాం..**
**ప్రభుత్వం కళ్లు తెరిపిద్దాం!**

ఇచ్ఛాపురం బాలికల జూనియర్ కళాశాల అభివృద్ధికి లోక్‌సత్తా తరపున రేకుల షెడ్లు వేసి మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా పాలకుల కళ్లు తెరిపిద్దామని జేపీ పిలుపునిచ్చారు. దీనికి వెంటనే స్పందించిన లోక్‌సత్తా జిల్లా బాధ్యులు డి.విష్ణుమూర్తి రూ.5వేలు విరాళంగా ప్రకటించారు.

పాఠశాలలు, కళాశాలల్లో కనీస మౌలిక సదుపాయాలు లేక విద్యార్థినులు అవస్థ పడుతున్నా ప్రభుత్వానికి పట్టదా? అని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జేపీ అన్నారు.

సురాజ్య యాత్రలో భాగంగా ఇచ్ఛాపురం బాలికల జూనియర్ కళాశాలను సందర్శించిన జేపీ.. అక్కడి ఇరుకు గదుల్లో విద్యార్థినులు చెమటలతో ఉండటాన్ని తీవ్ర ఆవేదన చెందారు.

ఒక్క గదిలో 200మంది ఎలా ఉంటున్నారు? ఎలా పాఠాలు వింటున్నారు? అధ్యాపక బృందం ఎలా పాఠాలు చెబుతోంది? నాకైతే అర్థం కావటం లేదు అని జేపీ అన్నారు. బాలికా విద్య పట్ల నిర్లక్ష్యానికి ఇది పరాకాష్ట అన్నారు. ఇలాంటి కళాశాల తెలుగు రాష్ట్రాల్లో ఉండటం బాధాకరమన్నారు.

10 ఏళ్ల క్రిందట తాను ఇచ్ఛాపురం వచ్చినప్పుడు ఇదే కళాశాల చెట్ల కింద ఉండేదని, ఇప్పుడు అంతకంటే దుర్భరంగా ఇరుకు గదుల్లోకి మారిందని జేపీ అన్నారు. ఇరుకు గదుల్లో, వరండాలో, మరుగుదొడ్లు కూడా లేక విద్యార్థినుల ఇబ్బందులను కనీసం పట్టించుకునే వారు లేకపోవడం దారుణమన్నారు. ప్రదర్శనలో జంతువుల్లా విద్యార్థులను చూడటం సిగ్గుగా ఉందన్నారు. పేదరికంలో పుట్టటమే వారి పాపమా? అవినీతి, పదవులు, భోగాలు, ప్రచార ఆర్భాటాలు తప్ప ఇలాంటి దుస్థితి పట్టదా?అని నిలదీశారు. దీనికితోడు.. 700 మంది విద్యార్థినులకు ఇద్దరు రెగ్యులర్, ఆరుగురు కాంట్రాక్ట్ అధ్యాపకులు బోధన అందిస్తే విద్యాభివృద్ధి ఎలా సాధ్యమవుతుంది? అని ప్రశ్నించారు.

కాలం గడుస్తున్నకొద్దీ మెరుగవకపోగా కీలకమైన విద్యారంగం రాష్ట్రంలో వెనకపట్టు పడుతోందని, పాలనా వైఫల్యానికి ఇంతకంటే నిదర్శనం అక్కర్లేదని జేపీ అన్నారు. విద్యాభివృద్ధికి వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని చెబుతున్నా క్షేత్రస్థాయిలో ఆ డబ్బేమీ కనిపించటం లేదన్నారు. 40వేల మంది జనాభా గల ఇచ్ఛాపురంలో ప్రతి విద్యార్థి మీదా చేస్తున్న వేల రూపాయల ఖర్చు ఎటుపోతోందని, ఇలాంటి కళాశాలలు ఎందుకున్నాయని ప్రశ్నించారు.

అనంతరం విద్యార్థులో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొని వారి ఆలోచనలను తెలుసుకున్నారు. సమస్యలను వివరిస్తూ, ప్రశ్నిస్తూ, ప్రశ్నలను ఆహ్వానిస్తూ సురాజ్య పరిష్కారాల్లో విద్యార్థులను భాగస్వాములయ్యేలా చేశారు. అర్హత లేనివారికి రిజర్వేషన్ల పేరుతో ఉద్యోగాలు కల్పిస్తుంటే ఈ దేశం అభివృద్ధి ఎలా సాధిస్తుంది? అని థెరెసా అనే విద్యార్థిని అడిగిన ప్రశ్నకు జేపీ జవాబిస్తూ, శతాబ్దాల అమానుష కులవివక్ష వల్ల కొంతమందికి రిజర్వేషన్లు అవసరమేనని, అయితే కలెక్టర్లు, మంత్రులు వంటివారి పిల్లలకు కోటా ఉండకూడదని అన్నారు. అగ్రకులాలుగా ముద్రపడినవారిలో పేదలకూ అవకాశం ఉండాలన్నారు.

కార్యక్రమంలో ఎంవిఎన్ శాస్త్రి, దక్కత కృష్ణమూర్తి రెడ్డి, తెన్నేటి తేజేశ్వర శర్మ, నాగేశ్వరరావు, సత్యనారాయణ, జానకీరావు, కోట రామారావు, కేసీ పూరి, నిర్మల్ కుమార్, వైబీఐ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు. ✦

# జంపరకోట పట్ల నిర్లక్ష్యం దారుణం





రైతులకు ఎంతో అవసరమైన జంపరకోట మినీ రిజర్వాయర్ పట్ల ప్రభుత్వాల నిర్లక్ష్యం దారుణమని, చిన్న సమస్యల్ని కూడా పట్టించుకోకుండా ప్రకటనలు మాత్రం ఆర్భాటంగా ఇచ్చుకుంటున్నారని జేపీ అన్నారు. వ్యవసాయానికి అనువుగా వున్న సాగునీటి ప్రాజెక్టులకు పాలకులు అత్యంత ప్రాధాన్యతనివ్వాలన్నారు.

సురాజ్య యాత్రలో భాగంగా శ్రీకాకుళం జిల్లా పాలకొండ మండలం జంపరకోట రిజర్వాయర్‌ను జేపీ సందర్శించారు. పనుల జాప్యంపై రైతులనడిగి తెలుసుకున్నారు.

ఎన్నో ఏళ్లుగా జంపరకోట పట్ల నిర్లక్ష్యం రాజ్యమేలుతోందని, హుద్‌హుద్ తుఫానులో కొట్టుకుపోయిన ఈ రిజర్వాయర్ గట్టుకు అప్పట్లోనే కాసిని నిధులు కేటాయించి పనులు జరిపించి ఉంటే దీనిపై ఆధారపడిన వేలాది ఎకరాలు సస్యశ్యామలమై ఉండేవని జేపీ అన్నారు. కనీసం గ్రామాలకు నిధులు తగినన్ని కేటాయించినా రైతులు ఇలాంటి పనుల్ని వెంటనే తమంతట తామే చేసుకోగలిగి ఉండేవారన్నారు. కేంద్రం నుంచి 51శాతం నిధులస్తున్నా, రాష్ట్రం నుంచి స్థానిక ప్రభుత్వాలకు నామమాత్రంగా కూడా నిధులు రావడం లేదన్నారు.

ఉత్తరాంధ్ర ప్రాంతంలో చిన్న సాగు ప్రాజెక్టులను తక్కువ ఖర్చుతో వేగంగా పూర్తి చేసే అవకాశమున్నా పాలకులు పట్టించుకోవటం లేదని జేపీ అన్నారు. రైతులకు నీటి వసతి దగ్గర్నుంచి మార్కెట్ వరకు లాభం చేసే పనుల మీద ప్రభుత్వాలు దృష్టి పెట్టిన సందర్భాలు చాలా తక్కువని, తెలుగు రాష్ట్రాల్లోనూ దేశంలో కూడా రైతుల కష్టాలకు మూలం ప్రభుత్వాల విధానాలేనని స్పష్టం చేశారు. వ్యవసాయాన్ని నిర్వీర్యం చేసేందుకు పథకం ప్రకారం కుట్ర చేస్తున్నట్టుందన్నారు. వ్యవసాయంపై లక్షల కుటుంబాలు, కోట్లమంది ప్రజలు ఆధారపడ్డారన్న ఇంగితజ్ఞానం కూడా పాలకులకు కరవైందన్నారు.

జంపరకోట జలాశయం పనులు పూర్తికి సహకరించాలని బద్దుమాసింగి సర్పంచ్ పైల సత్తిబాబు, రైతులు ఈ సందర్భంగా జేపీకి వినతిపత్రం ఇచ్చారు. ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని, రైతులు కూడా ఐకమత్యంతో వ్యవహరిస్తూ తమ సమస్యలపై అవగాహనతో వ్యూహాత్మకంగా వ్యవహరించటాన్ని అలవర్చుకోవాలని సూచించారు.


విష్ణుమూర్తి, రాంబాబు, జద్దు బాలరాజు, బి.చిన్నంనాయుడు, ఎం.మురళి, సూరపునాయుడు, వైకుంఠరావు, అనంతసాయి, ఆది, గణపతి, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ✦

## తోటపల్లికి కేంద్ర నిధుల మంజూరుకు కృషి



అంతకుముందు ఉల్లిబొద్ర కుడి ప్రధాన కాలువ నిర్మాణ పనులను జేపీ పరిశీలించారు. ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను ఈఈ హెచ్. మన్మథరావు, డీఈ ఎస్.పాండులను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ దీర్ఘకాలంగా ఉన్న పాత ఆయకట్టు కుడి, ఎడమ కాలువల ఆధునికీకరణ సమస్యను రైతు సంఘం నాయకుడు బుడితి అప్పల నాయుడు జేపీకి వివరించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఏటా సాగునీటి కష్టాలు వెన్నాడుతున్నాయని చెప్పారు. లోక్‌సత్తా నేతలు రామ్మోహనరావు, బాబ్జీ, గేదెల రాజేంద్రనాయుడు, విష్ణుమూర్తి, రాంబాబు, ఆకుల దామోదరరావు, కొత్తకోట పాపారావు, బి.గౌరీశంకరరావు, బి.చిన్నంనాయుడు, రామినాయుడు, ఎం. మురళి తదితరులు కూడా పాల్గొన్నారు. తోటపల్లి సాగునీటి ప్రాజెక్టుకు అందాల్సిన కేంద్ర నిధుల మంజూరుకు కృషి చేస్తానని జేపీ అన్నారు. ✦

# కాకి లెక్కల పోలికలు చూసి కంగారుపడొద్దు



విజయనగరం జిల్లా అభివృద్ధి ఆశించిన స్థాయిలో లేదని, దీనికి ఆవేదన చెందడంకన్నా ఆత్మపరిశీలన చేసుకోవటం అవసరమని డా॥ జేపీ అన్నారు. అన్నీ ఉన్నా, ఈ జిల్లా వెనకబడటానికి మానవ తప్పిదాలే కారణమన్నారు. మనం, మనవాళ్లు అనుకుంటున్న మన చుట్టూ ఉన్నవాళ్ల ప్రమేయం లేకుండా.. మన జిల్లాను ఎవరూ వెనకబాటుతనంలోకి నెట్టలేరన్నారు.

'ఫోరం ఫర్ బెటర్ విజయనగరం' వేదిక విజయనగరం ఎన్‌వీఎన్ లేక్ ప్యాలెస్‌లో నిర్వహించిన చర్చా కార్యక్రమంలో సురాజ్య యాత్రలో భాగంగా జయప్రకాష్ నారాయణ్ పాల్గొన్నారు. చాలా లోతైన అంశాలను స్పృశిస్తూ చర్చను లేవనెత్తారు. పౌర పెద్దల అభిప్రాయాలను తెలుసుకుంటూ, సందేహాలకు సమాధానమిస్తూ ఒక కార్యాచరణను అందించేందుకు ప్రయత్నించారు.




అభివృద్ధి అంకెల్లో విజయనగరం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే ఎంతో వెనకబడి ఉందని జేపీ అన్నారు. రాష్ట్ర విభజన జరిగి మూడేళు దాటాక ప్రస్తుతం అంకెలు చూసినా పెద్ద మార్పేమీ లేదన్నారు. అయితే రాష్ట్రం రెండంకెల అభివృద్ధితో రంకెలేస్తోంది, విజయనగరం మాత్రం వెనకబడి ఉందని భ్రమపడవద్దన్నారు.



ఏ అంశం గురించైనా స్పష్టత కావాలంటే సాక్ష్యాలు అంకెలు అవసరమేనని, అయితే అంకెల కోసం అంకెల వల్ల పెద్దగా ఉపయోగం ఉండదని జేపీ అన్నారు. అందుకే ఇప్పుడు రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు రెండ్రోజులకోమారు చెబుతున్న అంకెల రంకెలను, కాకి లెక్కల పోలికల్ని చూసి కంగారుపడొద్దన్నారు. దిగువ స్థాయి నుంచి పైస్థాయికి పెరిగేటప్పుడు వృద్ధి రేటు రెండంకెల్లో ఉన్నంత మాత్రాన, అదేదో గొప్ప అనుకోవాల్సిన పన్లేదన్నారు. అలాగే మనదేశంలో తెలుగు రాష్ట్రాలు కొన్ని రంగాల్లో ముందున్నంత మాత్రాన అదే అభివృద్ధి కాదన్నారు.

మన పాలకులు దశాబ్దాలుగా చేస్తున్న తప్పిదాల వల్ల ఆర్థిక వ్యవస్థలో అనేక అవకాశాలను భారత్ కోల్పోయిందని జేపీ అన్నారు. ఉత్పత్తి రంగంలో పెరిగే అవకాశాలను వినియోగించుకునే ప్రయత్నాన్ని మనం చేయలేదని, పొరుగున ఉన్న చైనా వంటి దేశాలు వాటిని అందుకుని ఆర్థిక దిగ్గజాలుగా తయారయ్యాయని అన్నారు. సరైన విద్య, ఉపాధిని అందించకపోవటం వల్లే ఈవేళ యువభారతం గొప్ప అవకాశమా? పెనుభారమా? అని ఆందోళనలో ఊగిసలాడుతున్నామన్నారు. దురదృష్టవశాత్తూ ఉత్పత్తిరంగంలో కూడా ఈవేళ సవాళ్లు పెరిగిపోయాయని, కృత్రిమ మేధస్సు, రోబో యాంత్రీకరణలతో తయారీ పరిశ్రమలు కూడా కొత్తపుంతలు తొక్కుతున్నాయని అన్నారు. వీటిని అధిగమించి వెళ్లేందుకు కొత్త నైపుణ్యాలను, మార్గాలను రూపొందించుకోవాలన్నారు. విజయనగరం జిల్లా కూడా కొత్త ఆలోచనలు చేయాలన్నారు. జిల్లాలో కొత్త అవకాశాలకు ఉదాహరణగా, రామనారాయణం గురించి వివరించారు.

తాను దేవుడి గురించి, దైవదర్శనాల గురించి ఆలోచించనని, తన పని తాను చేసుకుపోతుంటానని, అయితే లోక్‌సత్తా నేతల కోరిక మేరకు విజయనగరం కోరుకొండ రోడ్డులోని రామనారాయణాన్ని సందర్శించి సీతారాములకు పూజలు నిర్వహించానని జేపీ తెలిపారు. రామాయణం విశిష్టతను అంత అందంగా శిల్పాలతో చెప్పటాన్ని తానెక్కడా చూడలేదని, భారతదేశంలోనే దీన్నో పెద్ద యాత్రాకేంద్రంగా తీర్చిదిద్దుకోవచ్చని అన్నారు. ఆర్థిక ప్రగతి మానవాభివృద్ధితో ముడిపడి ఉంటుందని, జిల్లాలో విద్య, వైద్యం ప్రమాణాలు అధ్వాన్నంగా ఉన్నాయని అన్నారు. గిరిజన ప్రాంతాల్లో పరిస్థితులు దయనీయంగా ఉన్నాయన్నారు. చిట్టివలస జ్యూట్ మిల్లును మూసివేస్తే ఇంతవరకూ తెరిపించే ప్రయత్నాన్నే స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రభుత్వం చేయలేదన్నారు. విద్య, వైద్యం, ఉపాధి, రైతుకు ఆదాయం, జిల్లాలో వున్న వనరులను ఆధునిక ఆర్థిక వ్యవస్థకనుగుణంగా వినియోగించుకోవటం అంశాల మీద స్పష్టమైన అవగాహనతో, ప్రణాళికతో ముందుకెళితే విజయనగరం పేరుకు తగ్గట్టే అర్థవంతమైన అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందన్నారు. సురాజ్య విజయనగరాన్ని సాధించుకునేందుకు యూత్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్, సిటిజన్స్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్‌లలో చేరి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. సమావేశంలో పౌర ప్రముఖులు, భీశెట్టి బాబ్జీ, లోక్‌సత్తా ఇతర నేతలు అనంతలక్ష్మి, రాయి పద్మావతి, ఆకుల దామోదర్, ఎం.చిన్నారావు తదితరులు పాల్గొన్నారు. ✦

# నా స్వార్థమేమిటో అర్థమైంది కాబట్టే సమాజం కోసం పనిచేస్తున్నా









ఊకదంపుడు నినాదాలు, ఉపన్యాసాల వల్ల సమాజంలో మార్పు రాదని.. సరైన విధానాలు, అందుకోసం నిర్దిష్ట ప్రయత్నం వల్ల మాత్రమే జనం జీవితాల్లో నిజమైన మంచి మార్పు వస్తుందని జేపీ అన్నారు. సమాజంలో మార్పు కోసం ఏ అధికారం లేకుండా కూడా నిరంతరం పోరాడుతూ అధికారంలో ఉన్నవారి కంటే కూడా ఎక్కువ సాధించానని, ఏదో త్యాగభావనతో తానీ పనిచేయటం లేదని అన్నారు. సమాజంలో మార్పు రాకపోతే మన జీవితాల్లో కూడా నష్టం వస్తుందని, తన స్వార్థమేమిటో తనకు స్పష్టంగా అర్థమైంది కాబట్టే సమాజం కోసం పనిచేస్తున్నానని అన్నారు. అందరూ ఇంతలా సమాజం గురించి ఆలోచించనక్కర్లేదని, కనీసం జీవితంలో 30శాతం మేర చుట్టూ ఉన్న ప్రపంచం, పాలన గురించి పట్టించుకుంటే చాలని అన్నారు. పొరుగున ఓ మురికి ప్రాంతంలోని పోరగాడ్ని కుట్టి వచ్చిన దోమ మనల్ని కూడా కుడుతుందని, ఎక్కడున్నా దోమల్ని నియంత్రించాలనుకోకపోతే అందరం నష్టపోతామని అన్నారు. మన వ్యక్తిగత సుఖాన్ని సమాజహితంతో సంధానం చేసుకుంటేనే జీవిత సాఫల్యత లభిస్తుందన్నారు.

సురాజ్య యాత్రలో భాగంగా పశ్చిమ గోదావరి జిల్లా దెందులూరు మండలం కొవ్వలి గ్రామంలో జయప్రకాష్ నారాయణ్ పర్యటించారు. తొలుత స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుంటలచెరువు గట్టుపై ఉషా పిక్చర్స్ అధినేత డాక్టర్ వి.వి బాలకృష్ణారావు అందించిన ఆర్థికసాయంతో ఏర్పాటు చేసిన పార్కును ప్రారంభించారు. మొక్కను నాటారు. అనంతరం మొటపర్తి భవన్‌ను సందర్శించి అక్కడ మహిళలకు అందిస్తున్న కుట్టుశిక్షణను పరిశీలించారు. వారితో మాట్లాడి ఎలా సద్వినియోగం చేసుకుంటున్నారో తెలుసుకున్నారు. తర్వాత గ్రామదీప్–కొవ్వలి ఉన్నత పాఠశాల సంయుక్తంగా ఏర్పాటు చేసిన సమావేశంలో గ్రామస్తులతో మాట్లాడారు.

గ్రామదీప్ ముఖ్య పోషకురాలు డాక్టర్ వెలమాటి మనోహరి ఆధ్వర్యంలో సర్పంచ్ బూసి రత్నాంజలి అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో జేపీ మాట్లాడుతూ.. అసమానతలతో కూడిన సమాజంలో మనమున్నామని, వీటిని తగ్గించే ప్రయత్నం చేయకుండా ఒకరికి లాభం కలిగితే ఇంకొకరికి నష్టమనే తీరులో రాజకీయం, సమాజం ఉంటే నష్టపోతూనే ఉంటామని అన్నారు. అసమానతల్ని తగ్గించటానికి, మనందరం







సుఖసంతోషాలతో ఉండటానికి నాణ్యమైన విద్య కీలకమన్నారు. మంచి చదువును అందరికీ అందించటం ద్వారా తప్ప ప్రపంచంలో ఎక్కడా పేదరికం తగ్గిన, ప్రజల్లో పరిణతి పెరిగిన దాఖలాలు లేవన్నారు. విద్య కోసం ప్రభుత్వం ఒక్కో విద్యార్థి మీద ఏటా రూ. 60,000 ఖర్చు చేస్తున్నా ఫలితాలు రావటం లేదని, కొన్నిచోట్ల రూ. 25,000-30,000తో కూడా మంచి ఫలితాలు వస్తున్నాయని అన్నారు. ఎందుకిలా అనే అన్న చర్చ లేదన్నారు. ఎంతో ముఖ్యమైన విద్య, వైద్యం వంటి అంశాల మీద చాలా దేశాల్లో పెద్ద చర్చలు జరుగుతుంటే, మన వద్ద మొక్కుబడి విషయాలుగా వాటిని చూస్తున్నామన్నారు. ప్రధానమంత్రి, ముఖ్యమంత్రుల చేతుల్లోనే అధికారాలు కేంద్రీకృతమైతే అభివృద్ధి ఎప్పటికీ ఇలాగే నత్తనడకన సాగుతుంటుందన్నారు. కోట్లాదిమంది నివారించదగ్గ బాధలతో కన్నీరు కారుస్తూనే ఉంటారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేసే ఖర్చులో కొంతశాతాన్ని నేరుగా ప్రజలకే ఇస్తే చాలా గ్రామాలు కొవ్వలిలా అభివృద్ధి చెందుతాయన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా





నుంచి వేల కోట్ల అక్వా ఉత్పత్తుల ఎగుమతులు జరుగుతున్నా ఇక్కడి వసతుల కోసం కనీసం 1శాతం కూడా ఖర్చు చేయటం లేదన్నారు. సొమ్ము ప్రజలది, సోకు నాయకులది అన్న తరహాగా పాలన సాగుతోందన్నారు. అవినీతి మనదేశంలోనే, తెలుగు రాష్ట్రాల్లోనే ఎక్కువగా ఉందన్నారు. కులమతాలకతీతంగా ఓట్లు వేయటం, అవినీతిపరులను తిరస్కరించటం చేయాలన్నారు. అలాగే మనదృష్టంతా కేవలం ఎన్నికల మీద, నేతల గెలుపోటముల మీదే ఉండటంతో ప్రభుత్వాలు ఇష్టమొచ్చినట్టు వ్యవహరిస్తున్నాయని, ఎన్నికకు-ఎన్నికకు మధ్య ఏం జరుగుతుందన్నది పట్టించుకుంటేనే మన జీవితాలు బాగుపడతాయని అన్నారు. ఎన్నికల మధ్య ఏం చేయాలో చెప్పడానికే సురాజ్య యాత్రను ఉద్యమంలా చేపట్టినట్టు చెప్పారు. కొవ్వలిలో అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తున్న మనోహరి, రత్నాంజలిని, దాతలను జేపీ అభినందించారు. ఉన్నత చదువులు చదివి గ్రామం కోసం పనిచేస్తానంటే సోదరి మనోహరిని తాను వారించానని, స్కేల్‌లో తేడా ఉన్నా.. దేశంలో మార్పు తేవటంలాగే గ్రామంలో మార్పు తేవటమూ సంక్లిష్టమైనదేనన్నారు. సురాజ్య ప్రసంగంలో జేపీ చెప్పిన ఉదాహరణలు, ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించిన తీరు ఆకట్టుకుంది.

ఏఎంసీ మాజీ ఛైర్మన్ వడ్లపట్ల శ్రీనివాసరావు, ఎన్నారైలు, ఎంపీటీసీ మాదాసు దుర్గారావు, పెద్దసంఖ్యలో గ్రామస్తులు, లోక్‌సత్తా, వైబీఐ ప్రతినిధులు, తదితరులు పాల్గన్నారు. విద్యార్థినీవిద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ✦



# మాలాంటివారికి అందిన చదువు ప్రతి బిడ్డకూ అందాలి

తాను సామాన్య మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చానని, గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో చదివానని, ఆ తర్వాత లయోలా కళాశాలలో, మెడికల్ కళాశాలలో స్కాలర్‌షిప్పులతో చదువుకున్నానని, తనకొచ్చిన స్కాలర్‌షిప్పులు తాను చెల్లించిన ఫీజులకంటే కూడా ఎక్కువని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జేపీ తెలిపారు. ఇదంతా మంచి చదువు వల్లే సాధ్యమని, అలాంటి ఉపాధ్యాయులు, వాతావరణం స్కూళ్లలో ఆరోజుల్లో ఉందని వివరించారు. కేవలం నాణ్యమైన చదువు వల్లే తనకు శక్తి సమకూరి ఐఏఎస్‌కు దేశంలోనే టాప్‌టెన్‌లో ఎంపికయ్యానన్నారు. విశాఖపట్నం జిల్లాలో పోస్టింగ్‌లో దాదాపు 8,000మంది స్టీల్‌ప్లాంట్ నిర్వాసితులకు శిక్షణనిప్పించి మరీ ఉద్యోగాలు వచ్చేలా చేయగలిగానని, అది అప్పట్లో దేశంలోనే ఒక ఒరవడి అని తెలిపారు. ప్రకాశం జిల్లాలో, తూర్పు గోదావరి జిల్లాలో కలెక్టర్‌గా తాను అందించిన సేవల గురించి 30 ఏళ్ల తర్వాత ఇప్పుడు కూడా చెప్పుకుంటున్నారన్నారు. అనేక పదవుల్లో పనిచేసి, వ్యవస్థీకృత మార్పు కోసం రాజకీయ, పాలనా సంస్కరణల కోసం లోక్‌సత్తాను స్థాపించానని, దాదాపు 16ఏళ్లు తాను పదవుల్లో ఉన్నా ఒక్కటంటే ఒక్క ఆరోపణను ఎదుర్కోకుండా అద్భుతమైన ప్రశంసల్ని ఆశీస్సులుగా పొందానని వివరించారు.. కేవలం విలువలు చెదరకుండా సామర్థ్యాన్ని పెంచే మంచి చదువు అందటం వల్లే ఇన్ని విజయాల్ని తాను సాధించిచూపానన్నారు. “మా తరంలో అనేకులకు అందిన చదువు ఇప్పుడు లేకుండా పోయింది. నామమాత్రపు ఫీజులతో ఆ రోజున మేం నాణ్యమైన చదువును అందుకుంటే.. ఈరోజున ప్రభుత్వం ఒక్కో స్కూలు విద్యార్థి మీదా ఏటా రూ. 60,000 ఖర్చు పెడుతున్నా చదువు రావటం లేదు. ఎందుకిలా అనే అంతర్మథనం జనంలో, ప్రభుత్వంలో జరగాలి” అని జేపీ అన్నారు.

సురాజ్య యాత్రలో భాగంగా విజయనగరం జిల్లాలోని పలుచోట్ల గ్రామీణ విద్యార్థులు, తల్లిదండ్రులతో జేపీ చర్చ చేశారు. సురాజ్య ఎజెండా వారి జీవితాల్లో ఎలా మార్పు తెస్తుందో వారిలో ఆలోచన రేకెత్తిస్తూ వివరించారు.

“మా తరంలో అందిన విద్య ఈరోజు ప్రతి బిడ్డకూ అందాలి” అని జేపీ అన్నారు. దీనికి అదనపు నిధులు కూడా అవసరం లేదన్నారు. ఇప్పుడు కేటాయిస్తున్న డబ్బుతోనే అందరికీ మంచి చదువు అందించవచ్చని తెలిపారు. దీనికి తగిన విధానాలు, అమలులో కొన్ని ఏర్పాట్లు అవసరమన్నారు. ✦

### ప్రశ్నిస్తూ, సమాధానాలు రాబడుతూ..

**సురాజ్య ఎజెండా లక్ష్యాలను, అక్కడికి వచ్చిన ప్రజలకు సమస్యలను, వాటికి తాను సూచించే పరిష్కారాలను వివరించాక జేపీ ఇష్టాగోష్టిలాగా జనాభిప్రాయం తెలుసుకుంటున్నారు. సురాజ్య యాత్ర కార్యక్రమం పలుచోట్ల ఇలాగే సాగుతోంది. కానీ కొన్నిచోట్ల జేపీ మాట్లాడాక, ప్రశ్నలు అడగటానికి ప్రజలు సంకోచించటం కనిపించింది. దీంతో జేపీయే చొరవ తీసుకుని వారిని ప్రశ్నిస్తూ స్పందనల్ని రాబట్టారు. చిన్న చిన్న పరిష్కారాలతో పెద్ద సమస్యల్ని పరిష్కరించవచ్చనే ధైర్యాన్ని వారిలో నింపుతూ.. సురాజ్య లక్ష్యాల్లో మేము సైతం అని వారు భావించేలా చేశారు.**







# ఆలోచనతో నిర్ణయాలు తీసుకోండి.. అద్భుతాలు అవే జరుగుతాయి

విద్యార్థులు, యువత ఆవేశంలోకన్నా ఆలోచనతో నిర్ణయాలు తీసుకోవటం ప్రారంభిస్తే.. వారి జీవితాల్లోనూ, సమాజంలో కూడా అద్భుతమనపించే మార్పులు వాటంతటవే జరుగుతాయని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జయప్రకాష్ నారాయణ్ అన్నారు.

జనం కోసం జేపీ సురాజ్య యాత్రలో భాగంగా.. సుజాత విద్యాసంస్థల ఆధ్వర్యంలో విజయనగరం ఆనందగజపతి ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన విద్యార్థుల సదస్సులో ఆయన మాట్లాడారు. ఏది సమస్యలకు మూలం, దేనివల్ల మౌలిక మార్పు వస్తుంది అర్థం చేసుకుంటే ప్రతి విద్యార్థీ మార్పుకు చోదకశక్తి అవుతాడన్నారు. ఇలా లోతైన పరిశీలన, విశ్లేషణ చేసే శక్తిని అందించటం, సొంతంగా పరిష్కారాలను చెప్పగలగటాన్ని నేర్పించటమే విద్య లక్ష్యమన్నారు. ఇలాంటి విద్యను పొందేవారు ఏ డిగ్రీ చదివినా ఉపాధిని పొందగల నైపుణ్యాలను అలవరచుకోగలుగుతారన్నారు. తమ కెరీర్‌లో ఎదుగుతూనే సమాజాన్ని బాగు చేస్తారన్నారు.

చుట్టూ వున్న సమాజం, వివిధ రంగాల్లో పరిస్థితులపై విద్యార్థుల అభిప్రాయాలను, స్పందనల్ని జేపీ అడిగి తెలుసుకున్నారు. పరిష్కారాలు మీరేమనుకుంటున్నారో వివరించమన్నారు. వారు లేవనెత్తిన సమస్యలకు మూలమైన పరిష్కారాలను తెలియచేశారు.

బాబు వస్తే జాబు వస్తుందని ఎన్నికల్లో ప్రచారం చేసుకున్నారని, కానీ జాబు రావాలంటే ముందుగా ఉపాధి అవకాశాలను సృష్టించాలని జేపీ అన్నారు. లంచాలు లేని పాలనా వ్యవస్థ కావాలన్నారు. మన రోజువారీ జీవితాల్లో దాదాపు 80శాతం స్థానికంగా ఉండే అంశాలతోనే ముడిపడి ఉంటుందని, అక్కడ పాలన సక్రమంగా లేకపోతే ఎదిగే అవకాశాలు బలహీనపడతాయని జేపీ అన్నారు. అందుకే స్థానిక పాలన నిర్వహణను, ప్రభుత్వ కార్యాలయాల్లో అందుతున్న సేవలను గురించి అవగాహన పెంచుకోవాలన్నారు. పౌరసేవల విషయంలో లంచాలు తీసుకుంటే యువత అప్రమత్తం కావాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నా లంచాలు ఎందుకు పెరిగిపోతున్నాయో తెలుసుకుని విరుగుడు వేయాలన్నారు. ఇందుకోసం సర్కారీ ఆఫీసుల్లో 'పౌర సేవల' చట్టం వంటి వాటి గురించి తెలుసుకోవాలన్నారు. ఈ చట్టం ఉంటే.. గవర్నమెంట్ ఆఫీసులో ప్రతి పనికీ గడువు ఉంటుందని, ఆలోగా చేయకపోతే రోజుకు కనీసం రూ.250 చొప్పున పరిహారం చెల్లించాలని అన్నారు. ఇలా పౌరసేవల కోసం సిటిజన్ ఛార్టర్లను లోక్‌సత్తా 1998లోనే ఆవిష్కరించిందన్నారు. లంచాలు లేని పౌరసేవల్లో భాగంగానో, వేరేగానో మనకు మంచి చదువు, ఆరోగ్యాల్ని కూడా అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనన్నారు. వీటన్నిటి కోసమే మనం పన్నులు కడుతున్నామన్నారు. విద్యకు ఎంత ఖర్చవుతోంది, ఆ చదువులు చదువుకున్నవారికి ఉపాధి ఎలా వస్తోంది, ఒకవేళ రాకపోతే ఎందుకు రావటం లేదు లోతుగా పరిశీలించాలన్నారు. మన సమస్యలన్నిటికీ పరిష్కారాలున్నాయని, ఇవన్నీ ఆచరణసాధ్యమైనవేనని అన్నారు. కావలసిందల్లా.. మనం మన గురించి, చుట్టూ ఉన్న సమాజం, పాలన గురించి పట్టించుకోవటమేనన్నారు.

విద్యార్థులు, యువతలో అవగాహనతో ప్రశ్నించే శక్తి వస్తే దేశంలో మార్పు వచ్చేసినట్టేనని జేపీ అన్నారు. ఈ అవగాహనను, సంఘటితంగా పనిచేసే అవకాశాన్ని కల్పించేందుకే యూత్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్, సిటిజన్స్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్ వెబ్ ప్లాట్‌ఫారాలను అందిస్తున్నామని, రాష్ట్రంలోని వారంతా సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గుంటూరు సుజాత విద్యాసంస్థల డైరెక్టర్ బీపీ రావు, విద్యార్థులు, అధ్యాపకులు, లోక్‌సత్తా, వైబీఐ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. ✦

# గ్రామాలకు 50శాతం నిధులు రావాలి



స్థానిక సమస్యలపై ఎక్కడో పైనుంచి నిర్ణయాలు తీసుకునే ప్రస్తుత వ్యవస్థ వల్లే జాప్యం, అవినీతి పెద్దఎత్తున జరుగుతున్నాయని జేపీ అన్నారు. ఏ పనికి ఎవరు బాధ్యులో తెలియదని, కుంటిసాకులు చెప్పి అందరూ తప్పించుకుంటారన్నారు. ఎక్కడి పనులపై అక్కడే అవగాహన ఎక్కువగా ఉంటుందని, నిర్ణయాలు కూడా అక్కడే తీసుకునే ఏర్పాటు చేస్తే ప్రజలకు సురాజ్యం చేరువవుతుందని అన్నారు.

జనం కోసం జేపీ సురాజ్య యాత్రలో భాగంగా శ్రీకాకుళం జిల్లా పొందూరు మండలంలో జయప్రకాష్ నారాయణ్ యువత, మహిళలు, రైతులు, మధ్యతరగతి వర్గాలతో మాట్లాడారు.

ఎస్ఎఫ్‌కేకే సంఘం ఆవరణలోని మహాత్మాగాంధీ విగ్రహానికి నూలు దండను వేసి నివాళులర్పించిన అనంతరం పొందూరు పట్టుశాలి కళ్యాణ మంటపంలో సర్పంచి కోరుకొండ జయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో జేపీ పాల్గన్నారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ, బిజూ పట్నాయక్, ఎన్టీరామారావు, జోతిబసు, రామకృష్ణ హెగ్డే వంటి వారి పోరాటాలతో ఇప్పుడు రాష్ట్రాలకు నిధులు భారీగా పెరిగి 50శాతం దాటాయని, అయితే రాష్ట్రం నుంచి గ్రామాలకు మాత్రం రావటం లేదని అన్నారు. అప్పుడప్పుడు విదిలింపులు తప్ప గ్రామపంచాయతీలకు తప్పనిసరిగా రావాల్సిన నిధులు రావడం లేదన్నారు. కేంద్రం నుంచి వచ్చిన నిధుల్లో 50శాతం గ్రామాలకు వస్తే ఇక్కడి పనులు ఇక్కడే చేసుకోవచ్చన్నారు. దేనికీ ఎవరినీ దేబిరించాల్సిన అవసరముండదన్నారు. ఇక్కడేదైనా తప్పు జరిగితే స్థానికంగా ప్రజలే సర్పంచ్ తదితరుల చొక్కా పట్టుకోవచ్చని, రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకో ఉన్నతాధికారిని నియమించి పర్యవేక్షించి అవినీతిపరులపై కఠిన చర్యలు తీసుకోవచ్చన్నారు. ఇలాంటి గ్రామస్వరాజ్యాన్నే గాంధీజీ ఆశించారని, అయితే ఆయన ఆశయాలకు వ్యతిరేకంగా నేటి పాలకులు వ్యవహరిస్తున్నారని అన్నారు. కొంతమంది పెద్దలు గద్దెనెక్కినంత మాత్రాన అది స్వరాజ్యం కాజాలదని, ప్రతి పౌరుడూ, పౌరురాలూ తలెత్తుకుని బతికినరోజే నిజమైన స్వరాజ్యమని గాంధీ విస్పష్టంగా చెప్పారన్నారు. గాంధీజీకి దండ వేసే హక్కు ఈ దేశంలో ఈవేళ ఏ పార్టీ నాయకుడికీ లేదన్నారు. అసంపూర్ణంగా ఉన్న స్వరాజ్యాన్ని నిజమైన స్వరాజ్యంగా మార్చేందుకే సురాజ్య ఉద్యమాన్ని చేపట్టామన్నారు.

కొద్దిసేపు మాట్లాడిన అనంతరం విద్యార్థులు, యువత, గ్రామస్తులు ప్రశ్నలడిగేందుకు, చర్చించేందుకు జేపీ ప్రాధాన్యతనిచ్చారు. చాలా ప్రశ్నలు ఉపాధి అవకాశాల కోసం వచ్చాయి. దీనిపై స్పందిస్తూ, ప్రభుత్వం ఉన్నది మనకు అవసరమైన శాంతిభద్రతలు, రోడ్లు వంటి ఉమ్మడి అవసరాలు చేయడానికి, ఉద్యోగాలు పెరిగే ఆర్థిక వ్యవస్థను నిర్మించడానికని, అంతేతప్ప ఉద్యోగాలు సృష్టించటం ప్రభుత్వాల పనికాదని జేపీ స్పష్టం చేశారు. ప్రభుత్వం మనకు సంబంధించి తన పని చేయడానికి కొందరు ఉద్యోగులను పెట్టుకుంటుంది తప్ప ఉద్యోగాల కల్పన చేయటం దాని పనికాదని అన్నారు. కానీ రాజకీయ స్వార్థం కోసం పార్టీలు ఉద్యోగాలంటే ప్రభుత్వోద్యోగాలన్నట్టుగా యువతను, ఇతర ప్రజల్ని భ్రమింపచేస్తున్నాయన్నారు. ప్రభుత్వోద్యోగాల మీద మమకారం తగ్గించుకుని సమాజానికి పనికొచ్చే పనులు చేసి ఉపాధి పొందే సంస్కృతి మొదలైతే ప్రతి ఒక్కరికీ జీవనోపాధి లభిస్తుందన్నారు. చిన్న, పెద్ద ఉద్యోగాల మనస్తత్వాన్ని విడిచిపెట్టి డిగ్నిటీ ఆఫ్ లేబర్‌తో పనిచేయాలన్నారు.

**సిక్కోలు జిల్లాకే మణిహారంగా ఉన్న పొందూరు ఖద్దరు మార్కెట్‌లో నిలదొక్కుకునేందుకు అమూల్ తరహాలో సహకార పద్ధతిలో వ్యాపారం చేయాలని జేపీ సూచించారు.**

స్థానిక ఉపాధ్యాయుడు కె.వెంకటరావు తదితరులు సమస్యలను వివరించారు. వార్డు సభ్యుల సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పీసీసీ చంద్రమోహన్ తమ సమస్యలపై వినతిపత్రాన్ని అందించారు. ఎంపీటీసీ సభ్యుడు కోరుకొండ సాయికుమార్, కె.పోలినాయుడు, నాగేశ్వరరావు, సంతోష్, ఎం.వి.ఎస్.ఎన్ శాస్త్రి, ముల్లు హరనాథ్, బండారు జయప్రతాప్, స్థానిక కళాశాలల విద్యార్థులు, లోక్‌సత్తా ఏపీ, తెలంగాణ కన్వీనర్ బండారు రామ్మోహనరావు, లోక్‌సత్తా పార్టీ ఏపీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, వైబీఐ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు. ✦

# ఆత్మగౌరవంతో బతికితేనే సురాజ్యం

ప్రజలు ఆత్మగౌరవంతో బతికిననాడే నిజమైన స్వరాజ్యం సిద్ధించి సురాజ్య మవుతుందని జేపీ అన్నారు. జనం కోసం జేపీ సురాజ్య యాత్రలో భాగంగా ఆయన శ్రీకాకుళం జిల్లా లావేరు మండలంలోని బెజ్జిపురం యూత్ క్లబ్‌ను సందర్శించారు. యువత, మహిళలతో సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు.

గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసిన అనంతరం యూత్ క్లబ్ సభ్యుల నుంచి కార్యక్రమాలు, సమస్యలు గురించి జేపీ తెలుసుకున్నారు. సురాజ్య యాత్ర గురించి వారికి వివరించారు. దాదాపు వారి సమస్యలన్నిటికీ మూలాలు సురాజ్య ఎజెండాలోనే ఎలా ఉన్నాయో తెలియచెప్పారు.



గ్రామాల్లో స్వయంఉపాధి, స్వయం సమృద్ధి, పర్యావరణానికి మేలు చేసే పరిశ్రమల ఏర్పాటుతోనే బాపూజీ కోరుకున్న గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందని జేపీ అన్నారు. నిర్ణయాలు, పరిష్కారాలు గ్రామస్థాయిలోనే జరగాలి తప్ప, ఎన్నుకున్న నేతలు అధికార దర్పంతో జనం నెత్తిన రుద్దకూడదన్నారు. దేశంలో ఒక్కరోజుకు వేల కోట్లు ఖర్చవుతున్నాయని, అందులో సద్వినియోగం అయ్యే శాతమెంతో ప్రజలే గ్రహించాలన్నారు. గ్రామాలకు రూపాయి నిధి ఇవ్వడానిక్కూడా రాష్ట్రాలకు మనసొప్పటం లేదన్నారు. మన సమస్యలు వాస్తవమని, అవి తీరకుండా అభివృద్ధి చెందలేమని, వాటన్నిటికీ పరిష్కారాలూ ఉన్నాయని, మనం కాస్త ఆలోచనతో స్పందించటమే కావల్సిందని అన్నారు.

తొలుత క్లబ్ డైరెక్టర్ ఎం.ప్రసాదరావు క్లబ్ చేపడుతున్న కార్యక్రమాలు, క్లబ్‌కు లభించిన జాతీయ, అంతర్జాతీయ పురస్కారాల వివరాలను జేపీకి తెలియచేశారు.

**గోగు వస్తువుల్ని కొనుగోలు చేసిన జేపీ**

యూత్ క్లబ్ ఆధ్వర్యంలో గోగు కిరణాలు లిమిటెడ్ ఏర్పాటు చేసిన గోగు హస్తకళా రూపాలను జేపీ సందర్శించారు. ఎంతో ముచ్చటపడ్డారు. కొన్ని బ్యాగులను కొనుగోలు చేశారు. గోగునార ఉత్పత్తులు పర్యావరణానికి మేలు చేసేవిగా ఉంటాయని, వాటిని ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని అన్నారు. ఉత్పత్తిదారుల ఆదాయ వివరాలు, ఉత్పత్తి విధానం, మార్కెటింగ్ సదుపాయాలు, ఇతర అంశాలను ఆయన మహిళలనడిగి తెలుసుకున్నారు. క్లబ్ సేవలను జేపీ ప్రశంసించారు.

క్లబ్ కార్యదర్శి ధర్మారావు, పరిపాలనాధికారి ఎం.రామారావు, జడ్పీటీసీ ప్రతినిధి పిన్నింటి మధుబాబు, సర్పంచ్ ప్రతినిధి ఇజ్జాడ శ్రీనివాసరావు, ఎంపీటీసీ అజార్, క్లబ్ ప్రతినిధులు నున్న శ్రీనివాసరావు, దుర్గారావు, జిల్లా శిశుసంక్షేమాధికారి లక్ష్మునాయుడు, గోగు కిరణాలు లిమిటెడ్ ఛైర్మన్ శర్వాణీ, లోక్‌సత్తా ప్రతినిధులు రామ్మోహనరావు, విష్ణుమూర్తి, శాస్త్రి, వెంకటరావు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి గీతా శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# అవినీతిపై ప్రగల్భాల వీరులు

**“అవినీతిపరులపై కేసులను వేగంగా విచారించి దోషులను కఠినంగా శిక్షించేందుకే ప్రత్యేక కోర్టుల చట్టాన్ని తీసుకొస్తున్నాం. ఇది ఏపీ అభివృద్ధికి తొలి మెట్టు”**

*– సెప్టెంబర్, 2015లో ప్రత్యేక కోర్టుల బిల్లును అసెంబ్లీలో ఆమోదించే రోజున ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు, తెదేపా, బీజేపీకి చెందిన శాసన సభ్యులు చెప్పిన మాటలు*

**“తెలంగాణలో అవినీతికి దాదాపు కళ్లెం వేశాం. కడుపు కట్టుకుని పనిచేస్తున్నాం. ఎవరైనా అవినీతికి పాల్పడితే నేరుగా నాకే చెప్పండి. టోల్ ఫ్రీ నెంబర్‌కి ఫోన్ చేయండి”**

*– 2015లో తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు*

**“నల్లధనం, అవినీతి నడ్డివిరిచేందుకే నోట్ల రద్దు (డీమానిటైజేషన్)”**

*–2016లో పెద్ద నోట్ల రద్దును ప్రకటించే సందర్భంలోనూ, ఆ తర్వాతా ప్రధాని నరేంద్ర మోదీ ఉవాచ*

.. కానీ టోల్‌ఫ్రీ నెంబర్లు, ప్రత్యేక కోర్టుల చట్టం, లేటెస్ట్ సాంకేతికతతో రూపొందించిన యాప్‌లు, డీమానిటైజేషన్.. వీటన్నిటినీ ఛేదించుకుని తెలుగు రాష్ట్రాల్లో అవినీతి విచ్చలవిడిగా కొనసాగుతోంది. రాజకీయ నాయకులు, వారి అండతో అధికారులు ప్రజల్ని వీలున్నచోటల్లా పీల్చిపిప్పిచేస్తున్నారు.

వివిధ పథకాల ద్వారా లబ్ధి పొందేవారి సమస్యల పరిష్కారం కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ‘1100’ నెంబర్‌కి గరిష్టంగా 25,000 దాకా రోజుకు ఫోన్ కాల్స్ వస్తున్నా.. రాష్ట్రంలో అవినీతి లేకుండా ప్రభుత్వ సేవలందిస్తున్నాం అని చంద్రబాబు బుకాయించే ప్రయత్నం చేస్తున్నారు. మా

### అధికారం ముఖ్యమంత్రికే

అవినీతి నిరోధక శాఖ కేసుల్లో పట్టుబడినవారిపై తదుపరి ఎలాంటి చర్యలు లేకుండా నిర్ణయం తీసుకునే అధికారం ముఖ్యమంత్రికి ఉంటుంది. సంబంధిత శాఖ ముఖ్యకార్యదర్శి, మంత్రి సిఫార్సు మేరకు ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకుంటారు. ఏసీబీ కేసుల్లో తదుపరి చర్యలు లేకుండా ఉపసంహరించుకుంటే, ఆ సమాచారాన్ని అసెంబ్లీకి చెప్పాలి. కానీ తెలుగు రాష్ట్రాల్లో ఇది జరగడం లేదు.



అధికారులు బంగారం అంటూ, వారికి త్వరలో కేంద్ర ప్రభుత్వోద్యోగులతో సమానంగా జీతభత్యాలు అందించే ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు. అవినీతిలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే నెంబర్‌వన్ స్థానాల్లో ఉందని వచ్చిన సర్వేను ఏడాదిలోగా సవరించుకున్నామని, అతి తక్కువ అవినీతి రాష్ట్రంగా రూపొందిస్తున్నామని 2017లో ముఖ్యమంత్రి ప్రకటించిన ఒకట్రెండు నెలల్లోనే.. ఇక్కడ అవినీతిని భరించలేం, ప్రభుత్వ రాయితీలకన్నా పన్ను రాయితీలివ్వండి అని పారిశ్రామికవేత్తలు గొడవ ప్రారంభించారు. ఇటీవల విజయవాడ కృష్ణా, గోదావరి పవిత్ర సంగమం వద్ద దారుణమైన బోటు ప్రమాదానికి అవినీతే కారణం.

తీవ్రతలో తేడా వున్నా.. తెలంగాణలోనూ ఇదే పరిస్థితి. తెలంగాణ ప్రభుత్వం 2015లో ఇచ్చిన టోల్‌ఫ్రీ నెంబర్‌కి వేలసంఖ్యలో వచ్చిన కాల్స్‌పై చర్యలేమిటో ఇప్పటికీ ఎవరికీ

## ఒక్క జీవోతో మాఫీ చేస్తున్నారు

ఏసీబీ విచారణను ధృవీకరించిన విజిలెన్స్ కమిషన్.. ప్రాసిక్యూషన్‌కు అనుమతించాలని సంబంధిత శాఖకు సిఫార్సు చేస్తుంది. ఇక ఆ శాఖలో అసలు కథ మొదలవుతుంది. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగి సంబంధిత శాఖాధిపతులను, తెలిసిన రాజకీయ నేతలను ప్రసన్నం చేసుకుంటారు. తానేమీ తప్పు చేయలేదని వినతిపత్రం ఇస్తారు. దీంతో కేసును అటకెక్కించటమో, లేదా ఏళ్ల తరబడి సాగదీయటమో చేస్తారు. చివరికి ఆ ఉద్యోగి పదవీ విరమణ కూడా చేయొచ్చు. కొద్దికాలం జైల్లో ఉండి వచ్చినవారు కూడా తర్వాత దర్జాగా కొలువులో చేరిన సందర్భాలు అనేకం. సస్పెన్షన్‌లో ఉన్న కాలానికి కూడా సగం వేతనం వీరు పొందారు. ఉద్యోగంలో మళ్లీ చేరాక కూడా పాతతరహాలోనే మళ్లీ దందా. ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో ఏసీబీకి పట్టుబడిన అవినీతి కేసుల్లో మెజారిటీ కేసుల్లో ఎలాంటి చర్యలు ఉండటం లేదు. పకడ్బందీ సాక్ష్యాధారాలున్నప్పుడు కూడా ఒక్క జీవోతో కేసుల్ని మాఫీ చేస్తున్నారు. ఎంతటి అవినీతి కేసైనా శాఖాపరమైన విచారణ లేదా కేసులను డ్రాప్ చేస్తున్నట్టు ప్రభుత్వం ఇచ్చే ఒక్క జీవోతో ముగిసిపోవాల్సిందే. ఏసీబీ కేసుల్లో చిక్కుకున్న చిరుద్యోగులపై మాత్రం అప్పుడప్పుడూ ప్రాసిక్యూషన్‌కు అనుమతి లభిస్తోంది. పలుకుబడి, ప్రజాప్రతినిధుల అండదండలు ఉన్న అధికారులు మాత్రం తప్పించుకుంటున్నారు. ఏపీలో ఒక ప్రభుత్వోద్యోగి ఏసీబీకి పట్టుబడి ఏకంగా సస్పెండయ్యాడు. తర్వాత రిటైరయ్యారు. ఆయనపై ప్రాసిక్యూషన్‌కి అనుమతించకపోగా చర్యలను ఉపసంహరిస్తున్నట్టు ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ఈ ఉత్తర్వుల ఆధారంగా ఆయన కోర్టుకు వెళ్లి జీతం బకాయిలను వడ్డీతో సహా వసూలుచేసుకున్నారు.

తెలియవు. భూదందాల్లో, నయీం వంటివారితో అంటకాగిన నేతలపై ఎందుకు చర్యలు తీసుకోవటంలేదో గట్టిగా ఎవరూ ప్రశ్నించలేరు. నిజామాబాద్ జిల్లా బోధన్ స్కాంలో దోషులెవరో స్పష్టంగా తెలినా అంతా గప్‌చిప్.



రాజకీయ నాయకులపైన అలావుంచితే, కనీసం ప్రభుత్వోద్యోగుల అవినీతి మీద కూడా చర్యలు తీసుకునే సాహసాన్ని చంద్రబాబు, కేసీఆర్, మోదీ చేయలేక పోతున్నారు. ప్రజలు కట్టే పన్నుల డబ్బును, ప్రజల వనరుల సంపదను.. వారికి అందించే సేవలతో సంబంధం లేకుండానే ప్రభుత్వోద్యోగుల జీతభత్యాల పెంపునకు పందేరం చేస్తున్నారు. పాతకాలంలో సోషలిస్టు భావజాలురు చేసిన ట్రేడ్ యూనియన్, భూసంస్కరణ రాజకీయాల్ని ఇప్పుడు ప్రాచుర్య సాంప్రదాయ పార్టీలు ఓటు బ్యాంకు రాజకీయాలకు చాలా తెలివిగా ఉపయోగించుకుంటున్నారు.

పారదర్శకతను పెంచి అవినీతికి కళ్లెం వేయడంలో ముఖ్యపాత్ర వహించే సాంకేతికతను సర్వరోగనివారిణిగా చూపిస్తూ.. అవినీతిపై గొప్ప పోరాటం చేస్తున్న మిస్టర్ క్లీన్‌లమని ఈ ముగ్గురు నేతలూ ప్రచారం చేసుకుంటున్నారు. కానీ తెలంగాణలో ఒక చిన్న నల్లా కనెక్షన్ కావాలన్నా, ఏపీలో ఒక పట్టాదారు పాసుపుస్తకం, సర్టిఫికెట్ కావాలన్నా సామాన్య మధ్యతరగతివారు, రైతులు, యువత లంచాలిస్తూ దేబిరించకతప్పడం లేదు. ఈ-సేవ కేంద్రాలు, ఫ్రాంఛైజీల్లో కూడా లంచాల్ని రుసుములతో కలిపి వసూలు చేస్తున్నారు.

ఇక అసమర్థంగా అమలుచేసిన డీమానిటైజేషన్ ప్రభావం రోజువారీ, పైస్థాయి అవినీతి నిరోధంలో దాదాపు శూన్యంగా మారింది. కొన్ని చోట్ల అవినీతి రేటు బాగా పెరిగింది కూడా.

పావం వీటికి ముఖ్యమంత్రులు, ప్రధానమంత్రి ఏం చేస్తారు? గతంలో ఏమోగానీ వారు ఇప్పుడైతే వ్యక్తిగతంగా నిజాయతీగా ఉన్నారని, అవినీతి అంతానికి చాలా గట్టి ప్రయత్నమే చేస్తున్నారని, లేకుంటే కనీసం ఈ మాత్రం కూడా ఏసీబీ దాడులు జరిగి జనానికి విషయాలు బయటపడేవి కావని.. మనలో పలువురు భ్రమపడుతున్నారు.

అందుకే.. ఏపీ పట్టణ విభాగం డైరెక్టర్ గొల్ల వెంకట రఘు, పురపాలక శాఖ ఇంజినీరింగ్ విభాగం జూనియర్ టెక్నికల్ అధికారి నల్లూరి వెంకట శివప్రసాద్, ఆయన భార్య, పురపాలక శాఖలో మాజీ అసిస్టెంట్ ఇంజినీర్ గాయత్రి వంటి వారి నుంచి అవినీతి నిరోధక శాఖ బైటపెట్టిన వందల కోట్ల ఆస్తులు, బంగారు నగల్ని, వజ్రాభరణాల్ని చూసి దిగ్భ్రాంతితో నోరెళ్లబెడుతున్నాం.

అంతకుముందు అచ్యుతాపురం తహసీల్దార్

## పెద్దల అండతో అవినీతి అనకొండగా ఎదిగిన రఘు

గొల్ల వెంకట రఘురామిరెడ్డి 1988లో అసిస్టెంట్ డైరెక్టర్‌గా ప్రభుత్వోద్యోగంలో చేరారు. విశాఖ సిటీ ప్లానర్‌గా విధులు నిర్వర్తిస్తున్న సమయంలో రాజకీయ, అధికార పెద్దల సహకారంతో పెద్దఎత్తున అవినీతి కలాపాలకు దిగారు. నిర్మాణదారులెవరైనా రఘును కలిసి మామూళ్లు సమర్పించుకోవాల్సిందే. విశాఖ నుంచి హైదరాబాద్ బదిలీ అయ్యాక కూడా రఘు అవినీతి హవా కొనసాగింది. భారీ ఆస్తులు అక్రమంగా సమకూర్చుకున్నారు. బహుళ అంతస్తుల భవనాలను ఎవరు నిర్మిస్తున్నారు? వాటి లోటుపాట్లేమిటి? వంటివి తెలుసుకుని ఆయా నేతలకు సమాచారమివ్వడం, అనుమతులపై కొర్రీలు పెట్టించి సెటిల్‌మెంట్లు చేయటం చేస్తుండేవారు. ఒక్క హైదరాబాద్‌లోనే రఘు రూ.200కోట్లు వెనకేసినట్టు అంచనా. బినామీల పేరుతో దాదాపు 20 బ్యాంకు ఖాతాలను రఘు నిర్వహిస్తున్నట్టు గుర్తించారు. రాష్ట్ర విభజన జరిగాక సీఆర్‌డీయే ఏర్పడి లే అవుట్ల అనుమతులివ్వడం, తాజాగా పదోన్నతులు వంటి వాటి ద్వారా కూడా భారీగా ఆర్జించారు. ఎట్టకేలకు పదవీ విరమణ చేస్తున్న సమయంలో 2017 సెప్టెంబర్‌లో పట్టుకున్నారు.

## రాయితీల కోసం వెళ్తే.. లంచాలడుగుతున్నారు

పరిశ్రమలు ఏర్పాటు చేస్తే రాయితీలు ఇస్తామని చెబుతున్నారు. కానీ వాటిని మంజూరు చేయడానికి అధికారులు లంచాలు డిమాండ్ చేస్తున్నారు. అవినీతికి ఆస్కారమిస్తున్న ఈ విధానానికి స్వస్తి చెప్పాలి. రాయితీలకు బదులుగా భూ బదలాయింపు, ప్లాన్ అప్రూవల్ ఛార్జీలు వంటి వాటిల్లో మినహాయింపులు ఇస్తే బాగుంటుంది. దీనివల్ల పెట్టుబడిదారులు తమ చేతిలోని నగదును వ్యాపారాభివృద్ధికి మరింత సమర్థవంతంగా వినియోగించుకోగలుగుతారు. ప్రైవేటు వ్యక్తుల వద్ద ఉన్న భూముల్లో 50 నుంచి 200 ఎకరాల్లో పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేయించి వాటికి రహదారులు, విద్యుత్తు, నీరు వంటి మౌలిక వసతులు ప్రభుత్వం కల్పిస్తే స్థానిక పెట్టుబడిదారులు పరిశ్రమల ఏర్పాటుకు ముందుకొస్తారు. ఇలాంటి పార్కులకు ఐలా స్టేటస్ ఇస్తే పన్నుల విధానం కూడా స్థానిక అవసరాలకు తగ్గట్టు వారే నిర్ణయించుకునే అవకాశం ఉంటుంది. అన్నీ ప్రభుత్వమే చేయాలంటే సాధ్యం కాదు. పన్నుల మినహాయింపు ద్వారా ప్రైవేటు వ్యక్తులను కొన్ని విభాగాల్లో ప్రోత్సహిస్తే ఫలితాలు వస్తాయి.

**– జి. సాంబశివరావు,**
**ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ రాష్ట్ర అధ్యక్షుడు**



రామచంద్రరావు, ఏపీ ప్రజారోగ్య విభాగం ఇంజినీర్ ఇన్ చీఫ్ పాముల పాండురంగారావు, రహదారుల భవనాల ఈఎన్‌సీ ఎం.గంగాధరం, ఏపీ విద్యా సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ చీఫ్ ఇంజినీర్ బి.జగదీశ్వర్ రెడ్డి, గాజువాక సబ్ రిజిస్ట్రార్ డి.వెంకయ్య నాయుడు, సూర్యాపేట గనుల ఏడీ సుధాకర్‌రెడ్డి, మెదక్ జిల్లా డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ గంగాధర్‌రెడ్డి.. ఇలా అవినీతి తిమింగలాలను చూసి నిశ్చేష్టమయ్యాం.

అవినీతిపై పోరాటం పేరుతో ముఖ్యమంత్రులు, మోదీ గాలిలో కత్తులు తిప్పుతున్నారు కాబట్టే.. రావాల్సిన ఫలితాలు రావడం లేదు. అవినీతి రకరకాల రూపాల్లో పెరిగిపోతోంది. అవినీతికి పాల్పడ్డవారిలో దొరికేవారు అతి కొద్దిమంది. ఆ దొరికిన దొంగల్ని కూడా శిక్షించలేనంత అసమర్థంగా మన రాష్ట్ర, దేశ పాలకులు వ్యవహరిస్తున్నారు. పైకి మాత్రం బీరాలు, ప్రగల్భాలు పలుకుతుంటారు. ఇందుకు మచ్చుకు కొన్ని హేతుబద్ధ సాక్ష్యాలు..

### కఠినశిక్షలతో దారికి...

అవినీతి, పన్ను ఎగవేతలను తీవ్రంగా పరిగణించటంతోపాటు అవినీతిపరులను కఠినంగా శిక్షించే చట్టాలకు మనదేశంలో పదును పెట్టాలి. ఇప్పటికే అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, సింగపూర్ వంటి దేశాలు– అవినీతిని అంతమొందించే దిశలో అక్రమార్కులకు కఠిన శిక్షలు విధించటంతోపాటు తప్పుడు కార్యకలాపాల ద్వారా సంపాదించిన ఆస్తులను సత్వరం స్వాధీనపరచుకునే యంత్రాంగాలను రూపొందించాయి. భారత్‌లో పరిస్థితి ఇందుకు భిన్నం! దశాబ్దాలుగా ప్రభుత్వ విభాగాల్లో ఊడలు దిగిన అవినీతికి అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. దీనికి ముఖ్యకారణం అవినీతిని అరికట్టి అక్రమార్కులను కఠినంగా శిక్షించే చట్టాలు లేకపోవడమే! రాజకీయాలు, ప్రభుత్వ విభాగాలు, న్యాయవ్యవస్థ, ప్రయివేటు రంగం.. ఇలా దేన్ని చూసినా అవినీతి మకిలబారి కనిపిస్తున్న తరుణంలో– గట్టి చర్యలతో ప్రభుత్వం రంగంలోకి దిగాలి. అవినీతి నిరోధక చట్టం–1988, ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్ చట్టం–2002, విజిల్ బ్లోయర్స్ ప్రొటెక్షన్ చట్టం వంటివి ఉన్నప్పటికీ అవినీతిపరుల ఆగడాలకు అడ్డుకట్ట పడటం లేదు. ప్రభుత్వం అవినీతిపరుల గుండెల్లో గుబులు పుట్టించేలా కఠిన చట్టాలు రూపొందించాలి. లెక్కకు మించిన అవినీతి కేసుల్లో వేలకోట్ల రూపాయలు అవినీతిపరుల పాలవుతున్నా పట్టించుకోని ప్రభుత్వాలు ఉన్నంతకాలం, అవినీతికి అడ్డుకట్ట పడదు సరికదా అది మరింత చెలరేగే ప్రమాదముంది. అందువల్ల ప్రభుత్వ విభాగాలను పూర్తిగా ప్రక్షాళించడంతోపాటు వాటి పనితీరులో మరింత పారదర్శకత జోడించేందుకు చర్యలు చేపట్టాలి. ఇప్పటికే వివిధ సర్కారీ విభాగాల కార్యకలాపాలను అంతర్జాలంతో అనుసంధానించటం ద్వారా అవినీతికి కొంతమేర అడ్డుకట్ట వేయగలిగారు. ఈ విధానాన్ని మరిన్ని విభాగాలకు విస్తరింపచేయాలి. అన్నిటికంటే ముఖ్యంగా అవినీతి కేసులను సత్వరం పరిష్కరించగలగాలి. దేశంలోని వివిధ న్యాయస్థానాల్లో ఏళ్లుగా నానుతున్న లక్షల సంఖ్యలోని అవినీతి కేసుల సత్వర పరిష్కారంపై దృష్టి సారించాలి.

### ఇండొనేషియా-పేదల పాలిట శత్రువు

అక్రమార్కుల పాలబడి సామాజిక సంక్షేమ కార్యక్రమాలు పక్కదోవ పడుతుండటంతో ఇండొనేషియాలో సంపూర్ణంగా పేదరిక నిర్మూలన సాధ్యంకాని అంశంగానే మిగులుతోంది. బడుగులకు పంపిణీ చేసేందుకు ఉద్దేశించిన బియ్యంలో సుమారు 20శాతం– గోదాములు దాటి సరఫరా కేంద్రాలకు తరలేలోపే అవినీతి పందికొక్కుల బారిన పడుతున్నాయి. ఇతర నిత్యావసరాలకూ ఇదే గతి పడుతోంది. ప్రజాపంపిణీ వ్యవస్థలు అక్రమార్కుల కబంధ హస్తాలలో చిక్కుకున్న కారణంగా వేళకు తిండి దొరక్క లక్షల సంఖ్యలో పేదలు పస్తులుంటున్నారు. బెంజిమెన్ ఓల్కెన్ అనే అమెరికన్ ఆర్థికవేత్త నిర్వహించిన పరిశోధనలో వెల్లడైన ఈ వాస్తవాలు– కోరలు సాచిన అవినీతి, సామాజిక ముఖచిత్రాన్ని చిందరవందర చేస్తున్న వైనాన్నే బయటపెడుతున్నాయి.

### ఫిలిప్పీన్స్- గుల్లబారుతున్న విద్య, ఆరోగ్యం

మనదేశంలోలాగే మునిసిపాలిటీల్లో అధికారులు, గుత్తేదారుల మధ్య చేతులు మారే డబ్బు ఫిలిప్పీన్స్‌లోని అనేక పట్టణాల్లో ప్రజలను విద్య, వైద్య సౌకర్యాలకు దూరం చేస్తున్నట్టు కొన్ని అధ్యయనాల్లో వెల్లడైంది. మురికివాడల్లో చెత్తను, మురుగునీటిని తొలగించాల్సిన గుత్తేదారులు బాధ్యతలు సరిగ్గా నిర్వహించడం లేదు. ప్రభుత్వ ఆసుపత్రులకు రోగ నిరోధక టీకాలు, అత్యవసర ఔషధాలు సరఫరా చేయాల్సిన బృందాలు మొండికేశాయి. సర్కారీ బడుల్లో కనీస సౌకర్యాల గురించి ఎంత తక్కువగా చెప్పుకుంటే అంత మంచిది. ఈ పరిణామాల వల్ల ఫిలిప్పీన్స్ ప్రజలు అనేక కష్టనష్టాలకు గురవుతున్నారు. విద్య, వైద్య రంగాలను గుల్లబారుస్తున్న అవినీతిని కట్టడిచేస్తే తప్ప ప్రజా జీవన నాణ్యత మెరుగుపడే అవకాశాలు లేవని ఆర్థిక నిపుణులు అజర్, గుర్గుర్‌లు తమ అధ్యయనంలో స్పష్టీకరించారు.

**–'ఈనాడు' కాలమ్‌లో తుమ్మల కిషోర్**

■ తెలంగాణలో అవినీతి ఆరోపణలు వచ్చిన నాలుగొందలకుపైగా అధికారులపై కేసులను ముఖ్యమంత్రి కేసీఆర్ తొక్కిపట్టారు (ఇది 2016లో సంఖ్య. దీనిపై తాజా వివరాలు తెలియరాలేదు).

■ ఆంధ్రప్రదేశ్‌లో వందలమంది అధికారులపై కేసులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఎత్తివేశారు. ఇంకొన్ని వందలు పెండింగ్‌లో ఉన్నాయి. గత ఆరునెలల్లో చర్యలు తీసుకున్నది కేవలం 16మందిపైనే కాగా, అసలు శాఖాపరమైన దర్యాప్తు



కూడా ఆరంభించని కేసులు 2,400కుపైగానే ఉన్నాయని సమాచారం.

■ అధికారుల వెనక ఉన్న రాజకీయ నేతలపై చర్యలు లేకుండా ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులూ రక్షణ కవచంలా వ్యవహరిస్తున్నారు. ఓటుకు కోట్లు కేసు నుంచీ భూదందాల వరకు అనేక ఉదాహరణలు ఇందుకు చెప్పుకోవచ్చు.

■ ఏపీలో ప్రత్యేక కోర్టుల చట్టం తెచ్చి రెండేళ్లవుతున్నా ఇంతవరకూ ఒక్క అవినీతిపరునిపై కూడా కఠిన చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

■ వాస్తవానికి అవినీతి కేసుల విచారణకు ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేయాలని 2008లో లోక్‌సత్తాయే ప్రతిపాదించింది. 2015లో చంద్రబాబు ప్రభుత్వం ప్రత్యేక కోర్టుల చట్టాన్ని ఆమోదించినా.. అందులో లోక్‌సత్తా చెప్పినట్టు అవినీతిపరుల ఆస్తులన్నిటినీ జప్తు చేసే ఏర్పాటు లేదు. కేవలం అవినీతి ద్వారా సంపాదించిన ఆస్తుల జప్తు మాత్రమే ఉంది. అవినీతి ఆస్తుల జప్తునకే అయితే.. రెవెన్యూ రికవరీ చట్టం చాలని తెలిసినా, మొక్కుబడిగా, ప్రజల్ని మభ్యపెట్టేందుకు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌ని కట్టడి చేసేందుకే ప్రత్యేక కోర్టుల చట్టాన్ని తెచ్చినట్టు కనిపిస్తోంది.

■ అవినీతి కేసులలో కీలకమైన సాక్ష్యాలపై దర్యాప్తు చేసేందుకు ఏసీబీ, సీబీఐలకు జవాబుదారీతనంగల స్వయంప్రతిపత్తి ఇవ్వాల్సి ఉన్నా ముఖ్యమంత్రులు, ప్రధాని ఈ విషయంలో విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు.

■ కేసు విచారణను పక్కదోవ పట్టించకుండా స్వతంత్ర ప్రాసిక్యూషన్ ఏర్పాటుకు చర్యలు లేవు.

■ ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రతి పనికీ నిర్ణీత గడువు పెట్టి ఆలోగా ప్రజలకు పనిచేసిపెట్టకపోతే రోజుకు కనీసం రూ.250 పరిహారం చెల్లించేలా 'పౌర సేవల' చట్టం తేవటానికి ఇంకా రాష్ట్ర, కేంద్ర పాలకులు తాత్సారం చేస్తున్నారు.

■ ప్రజలు అవినీతిపై నేరుగా స్పందించి వేగంగా కట్టడి చేసేందుకు వీలుగా స్థానిక ప్రభుత్వాలైన పంచాయతీలు, మునిసిపాలిటీలకు అధికార, ఆర్థిక వికేంద్రీకరణ లేదు.

■ ఇంకా విచిత్రంగా.. ఓ చిన్న సర్టిఫికెట్ కోసం రూ.100 లంచం ఇచ్చిన పౌరునికి ఏడేళ్ల వరకు కఠిన కారాగారశిక్ష, లంచం తీసుకున్న ప్రభుత్వోద్యోగిపై ఆరోపణను విచారించేందుకు మాత్రం లోక్‌పాల్ అనుమతి వంటి సవరణల్ని అవినీతి నిరోధక చట్టానికి చేయాలని మోదీ ప్రభుత్వం ప్రతిపాదించింది.

ఇదీ విషయం..

ఇన్ని లొసుగులతో అవినీతి అంతం కావాలంటే ఎలా అవుతుంది?

అంటే, సమస్య మన విధానాలలో, పాలకుల చిత్తశుద్ధిలో ఉంది.

ఏ స్వార్థం లేకుండా దేశం కోసం పనిచేయాలని అనుకునే నేతలు పాలకులుగా లేరు కాబట్టి.. అవినీతి అంతానికి స్పష్టమైన విధానాలను అవగాహన చేసుకుని, వాటి కోసం ప్రజలు డిమాండ్ చేస్తేనే అవినీతిరహిత పాలన సాకారమవుతుంది, సురాజ్యం సాధ్యమవుతుంది. ✦

# అవినీతిపరుల రక్షణ నిలయం సచివాలయమే



తెలంగాణలో అన్ని ప్రభుత్వ విభాగాలలో అవినీతి బాగా పెరిగిందని, అవినీతికి పాల్పడే ఉద్యోగులకు, అధికారులకు సాక్షాత్తూ సచివాలయమే అండగా మారిందని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ (సుపరిపాలన వేదిక) ఆందోళన వ్యక్తం చేసింది. అవినీతికి పాల్పడుతూ ఏసీబీకి రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిన అధికారులకు సైతం సచివాలయం మద్దతుగా ఉందని, నిందితులపై ఎలాంటి చర్యలు లేకపోవడమేకాకుండా పదోన్నతులు కూడా లభిస్తున్నాయని ఫోరం కార్యదర్శి పద్మనాభరెడ్డి అన్నారు. అనేక రూపాల్లో అవినీతి వ్యవస్థ బలంగా వేళ్లూనుకుని కొనసాగుతోందన్నారు. లిక్కర్ మాఫియాలో 1,100 మంది పాత్రధారులుగా ఉన్నప్పటికీ వారిపై ఇప్పటివరకూ ఎలాంటి చర్యలూ తీసుకోలేదన్నారు. ఫోరం అధ్యక్షుడు జస్టిస్ రెడ్డప్పరెడ్డి, ఉపాధ్యక్షుడు డాక్టర్ రావు చెలికానితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఆదాయానికి మించిన ఆస్తులు ఉంటే ఉద్యోగిని వెంటనే విధుల నుంచి సస్పెండ్ చేయాలని, అక్రమాస్తులను సీజ్ చేయాలని, అయితే ప్రభుత్వం ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోవటం లేదని అన్నారు. మియాపూర్ భూ కుంభకోణం, నయీం కేసులను సైతం ప్రభుత్వం నీరుగార్చిందని ఆరోపించారు. 'నయీం అక్రమ సంపాదనను రెండు కౌంటింగ్ మిషన్లతో దినమంతా లెక్కించారు. కానీ పోలీసులు మాత్రం రూ.4.30 లక్షలు మాత్రమే లభించినట్టు లెక్కతేల్చారు' అని విస్మయం వ్యక్తం చేశారు.

**ఇప్పటికీ ట్రిబ్యునల్ నియామకం లేదు**

అవినీతికి పాల్పడుతూ దొరికిన అధికారులు, ఉద్యోగులను విచారించి చర్యలు చేపట్టవలసిన ట్రిబ్యునల్ ఫర్ డిసిప్లినరీ ప్రొసీడింగ్స్ (టి.డి.పి)కి గత పదేళ్లుగా అధికారిని నియమించలేదని జస్టిస్ రెడ్డప్పరెడ్డి అన్నారు. మరోవైపు ప్రభుత్వం సైతం అవినీతి అధికారుల విచారణకు నిరాకరిస్తోందని, గత రెండేళ్లలో ఇలా 50 కేసులను నిరాకరించారని తెలిపారు. 'అవినీతి అధికారులను చెప్పుతో కొట్టాలని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. కానీ తన కళ్ల ముందే సచివాలయంలో బాహాటంగా అవినీతి జరుగుతున్నా స్పందించకపోవడం విచిత్రంగా ఉంది' అని ఆయన పేర్కొన్నారు. అవినీతి అధికారులపై విచారణ జరిపే కమిషనర్ ఆఫ్ ఎంక్వయిరీస్ కూడా పనిచేయడం లేదని, 96 కేసులు దీని పరిధిలో పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. అవినీతి అధికారులపై శాఖాపరమైన విచారణ కూడా జరగడం లేదన్నారు. దీంతో ఎనిమిదేళ్ల క్రితం కేసులు కూడా ఇప్పటికీ అతీగతీ లేకుండా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. 'అవినీతి అధికారులపైన విజిలెన్స్ కమిషన్ ఇచ్చే నివేదికలను ప్రభుత్వం అంగీకరించని పక్షంలో దానిపై చర్చించాలి. తాము ఎందుకు అంగీకరించడంలేదో ప్రభుత్వం సహేతుకంగా వివరించాలి. కానీ ఇప్పటి వరకు ఒక్క కేసుపైన కూడా అలాంటి చర్చ జరగలేదు' అన్నారు. అసలు విజిలెన్స్ కమిషన్ నివేదికలతో విభేదించే కేసులు ముఖ్యమంత్రి దగ్గరకు కూడా వెళ్లటం లేదని అన్నారు. పాలనలో అవినీతి తొలగిపోవాలంటే మొదట సచివాలయంలోనే ప్రక్షాళన జరగాలన్నారు. ✦

# రాజకీయ దగా వల్లే ఏపీకి హోదా రావటంలా!

కేవలం రాజకీయ దగా వల్లే ఆంధ్రప్రదేశ్ ప్రజలు ప్రత్యేక తరగతి హోదా అవకాశాన్ని నష్టపోవాల్సి వస్తోందని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కూసంపూడి శ్రీనివాస్ అన్నారు. హోదా ప్రతిపాదనను తొలుత చేసింది లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జేపీయేనని, గణాంకసహితంగా, హేతుబద్ధంగా ఆయన వెనకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు హోదా ఇమ్మని అసెంబ్లీలో అడిగారన్నారు. బీజేపీ, తెలుగుదేశం మొత్తం రాష్ట్రానికీ ఇస్తామని చెప్పి ఎన్నికలయ్యాక మోసం చేస్తున్నాయన్నారు. పారిశ్రామిక రాయితీలు ఇచ్చినా మేలు జరుగుతుందని 2015 నుంచి లోక్‌సత్తా మొత్తుకుంటున్నా వినలేదన్నారు. మొత్తం రాష్ట్రానికి, లేదా కనీసం వెనకబడిన సీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేకహోదా పారిశ్రామిక రాయితీలు ఇవ్వాలన్నారు. 'ప్రత్యేక హోదా-విభజన హక్కుల సాధన సమితి' ఆధ్వర్యంలో విజయవాడలో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. హోదా రాష్ట్రానికి హక్కని విభజన హక్కుల సాధన సమితి గౌరవ అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్ అన్నారు. ఇప్పటివరకూ కేంద్రం నుంచి నిధులపై ముఖ్యమంత్రి శ్వేతపత్రం విడుదల చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు రాష్ట్ర హక్కుల కోసం కృషి చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కృష్ణయ్య అన్నారు. కాంగ్రెస్ నేత పక్కాల సూరిబాబు, రాష్ట్ర విద్యార్థి యువజన ఐకాస కన్వీనర్ సాకే నరేష్, వైకాపా నేతలు వెల్లంపల్లి శ్రీనివాస్, మల్లాది విష్ణు, సీపీఐ నేత ముప్పాళ్ల నాగేశ్వరరావు, ప్రొఫెసర్ సదాశివరెడ్డి, ఆప్ నేత వెంకట రామారావు, విద్యార్థి సంఘాల నాయకులు నూర్ మహ్మద్, విశ్వనాథ సుబ్రహ్మణ్యం, సాధన సమితి నాయకుడు తాటికొండ నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు. ✦

# సామాన్య ప్రజలను మోసకారులుగా పరిగణించే వైఖరిని ప్రభుత్వం విడనాడాలి

- భరత్ ఝున్‌ఝున్‌వాలా



ఆర్థిక వ్యవస్థను పునరుజ్జీవింప చేయడానికై ప్రభుత్వ వ్యయాలను ఇతోధికంగా పెంచాలనే సంకల్ప సాఫల్యం.. ప్రభుత్వం అనుసరించే ఇతర విధానాలపై ఆధారపడి ఉన్నది. ఈ ఆర్థిక సూక్ష్మాన్ని అర్థం చేసుకోవడానికి వృద్ధి రేటు ప్రస్తుత పతనానికి దారితీసిన కారణాలను నిశితంగా, నిష్పాక్షికంగా పరిశీలించవలసి ఉన్నది.

వస్తూత్పత్తి కార్యకలాపాల్లో ఆటోమేటిక్ యంత్రాలను పెద్దఎత్తున వాడుతుండడం ఆర్థిక వ్యవస్థ పెరుగుదల రేటు పతనానికి మొదటి కారణం. దీనివల్ల పెద్ద ఫ్యాక్టరీల్లో ఉత్పత్తి వ్యయం గణనీయంగా తగ్గుతోంది. అయితే చిన్న, మధ్యతరహా వ్యాపార సంస్థలు కోలుకోలేని విధంగా దెబ్బతింటున్నాయి. సగటు మనిషి కొనుగోలు సామర్థ్యం తక్కువగా ఉండడం వల్ల మార్కెట్‌లో డిమాండ్ పడిపోవడంతో వృద్ధి రేటు అంతకంతకూ పతనమవుతోంది. ఉదాహరణకు గతంలో ప్రతి చిన్న పట్టణంలో బిస్కట్, బ్రెడ్ ఉత్పత్తిదారులు ఉండేవారు. ఇప్పుడీ సరకులు పూర్తిగా నగరాల్లో ఉన్న పెద్ద ఫ్యాక్టరీల్లో ఉత్పత్తి అవుతున్నాయి. ఈ చిన్నతరహా పరిశ్రమల్లో ఉద్యోగాలు ఇప్పుడు పూర్తిగా పోయాయి. ఉద్యోగాల సంఖ్య తగ్గడం మార్కెట్‌లో డిమాండ్ పడిపోవడానికి, వేతనాల తగ్గుదలకు దారితీసింది.

సరే, ప్రభుత్వ వ్యయాల పెంపుదల ఆర్థికమాంద్యాన్ని రూపుమాపగలుగుతుందా? బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టునే తీసుకోండి. ఉద్యోగాల సృష్టికి ఇదేమీ తోడ్పడదు. సంపన్నుల ప్రయాణ వ్యయాలను మాత్రం తగ్గిస్తుంది. చిన్న పట్టణాలలోని బిస్కట్‌ల ఉత్పత్తిదారు బుల్లెట్ ట్రైన్‌తో పొందే ప్రయోజనమేమీ ఉండదు. ఆ ప్రాజెక్టు వ్యయాన్నే చిన్న పట్టణాలు, గ్రామాల్లో రోడ్ల నిర్మాణానికి వినియోగిస్తే భిన్నమైన, మరింత మేలైన ఫలితాలు సమకూరతాయి. పాల సరఫరా మొదలైన కుటుంబ వ్యాపారాల నిర్వహణ మరింత మెరుగు పడడానికి ఆ రోడ్లు విశేషంగా తోడ్పడతాయి. పాల వ్యాపారి పట్టణాలకు సులువుగా రాగలిగి యాంత్రీకృత డెయిరీలతో పోటీ పడగలుగుతాడు.

అలాగే నల్లధనంతో ముడిపడిన ఉద్యోగాలు. ఒక మంత్రి ఒక హైవే ప్రాజెక్టును మంజూరు చేసినందుకు గాను సంబంధిత కాంట్రాక్టర్ నుంచి రూ.100కోట్లు లంచం తీసుకుంటాడనుకోండి. ఆ మంత్రి ఆ సొమ్మును ఆస్తుల విపణిలోనే మదుపు చేస్తాడు. తత్ఫలితంగా కొత్త ఉద్యోగాలు సృష్టి అవుతాయి. సదరు మంత్రి ఎటువంటి ముడుపులూ తీసుకోడని అనుకుందాం. జరిగేదేమిటి? ఆస్తుల విపణిలో మదుపులు తగ్గిపోతాయి. తత్కారణంగా సిమెంటు, ఉక్కు, శ్రమశక్తికి డిమాండ్ తగ్గిపోతుంది. హైవే నిర్మాణ వ్యయం కూడా రూ.100 కోట్లు తగ్గుతుంది. దీనివల్ల లగ్జరీ కార్లలో ప్రయాణించే వారు లబ్ధి పొందుతారు. ఆస్తుల విపణిలో తగ్గిపోయిన డిమాండ్‌తో సంభవించిన నష్టాన్ని ఆ లబ్ధిదారులు పూరించగలరా? సమాధానం స్పష్టమే. కాబట్టి.. ఆర్థిక వ్యవస్థ సజావుగా, శక్తిమంతంగా ముందుకు సాగాలంటే, అవినీతి తగ్గుదల కారణంగా తగ్గిపోయిన మదుపుల మేరకు ప్రభుత్వ వ్యయాలను పెంచి తీరాలి.

పెద్ద నోట్ల రద్దు (డీమానిటైజేషన్), వస్తు సేవల పన్ను (జీఎస్టీ)తో వినియోగదారుల, చిన్న వ్యాపార సంస్థల ప్రయోజనాలకు కలిగిన విఘాతం వృద్ధి రేటు ప్రస్తుత పతనానికి మూడో కారణం. నోట్ల రద్దుతో అసంఖ్యాక కుటుంబాల్లో ప్రభుత్వం పట్ల విశ్వాసం సన్నగిల్లింది. ఉదాహరణకు కుటుంబ భద్రతకు, భావి అవసరాలకు ముందస్తు జాగ్రత్తగా గృహిణులు పెద్దమొత్తంలో నగదును తమ అల్మారాల్లో దాచుకోవడం పరిపాటి. ప్రభుత్వం పట్ల విశ్వాసం సడలిపోవడంతో ఇప్పుడు వారు బంగారం కొనుగోళ్లకు ప్రాధాన్యం ఇస్తున్నారు. బంగారం నిల్వలు తమకు ఆర్థిక భద్రతను సమకూరుస్తాయని వారు విశ్వసిస్తున్నారు. బంగారం కొనుగోలుకు వినియోగిస్తున్న ధనం దేశం వెలుపలికి వెళ్లిపోతోంది.

ఇక జీఎస్టీ ప్రతి చిన్న వ్యాపారికి పెనుభారమై పోయింది. జీఎస్టీని చెల్లించేందుకు అయ్యే వ్యయాలు హెచ్చుస్థాయిలో

ఉంటున్నాయి. బడా వ్యాపార సంస్థలతో పోటీ పెరగడంతో చిన్న సంస్థల వ్యాపార దక్షతకు తీవ్ర విఘాతం కలుగుతోంది. ఈ కారణంగా ఉద్యోగాల సృష్టి అంతకంతకూ తగ్గిపోతోంది. దీంతోపాటు డిమాండ్ కూడా పడిపోతోంది. నోట్ల రద్దు, జీఎస్టీలతో కలిగిన నష్టాన్ని ఏ విధమైన ప్రభుత్వ వ్యయాలు భర్తీ చేయలేవు. సామాన్య మానవుడిని ఒక మోసకారిగా పరిగణించే వైఖరిని ప్రభుత్వం విడనాడాలి. నోట్ల రద్దులో అసమర్థతను, వైఫల్యాన్ని అంగీకరించి తీరాలి. అటువంటి చర్య మరోసారి తీసుకోబోమని ప్రజలకు ప్రభుత్వం తప్పనిసరిగా భరోసా ఇవ్వాలి.

చిన్న, పెద్ద తేడా లేకుండా ప్రతి వ్యాపారీ మోసకారి అనే విశ్వాసం ప్రాతిపదికగా జీఎస్టీని అమలుపరిచే యంత్రాంగాన్ని నెలకొల్పారు. ఈ వైఖరిని ప్రభుత్వం మార్చుకోవాలి. ఆర్థిక వ్యవస్థను పునరుజ్జీవింప చేయడానికి ప్రభుత్వం తప్పనిసరిగా అనుసరించాల్సిన మార్గాలు: సామాన్య ప్రజలు నిజాయతీపరులని విధాన నిర్ణేతలు విధిగా విశ్వసించాలి. కార్పొరేట్ కంపెనీల నుంచి ఎదురయ్యే పోటీ నుంచి చిన్న, మధ్యతరహా సంస్థలకు పూర్తి రక్షణ కల్పించాలి. పెద్ద వ్యాపార సంస్థల పోటీని అధిగమించేందుకై చిన్న వ్యాపార సంస్థలకు తోడ్పడేలా ప్రభుత్వ వ్యయాలు పెరగాలి.

(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో) ✦

# మార్కెట్ రోడ్డును మరమ్మతు చేయాలని నిరసన

దేశంలోనే నెంబర్‌వన్ మునిసిపాలిటీల్లో ఒకటిగా ఖ్యాతి గడించిన సూర్యాపేటలో మార్కెట్ రోడ్డు అధ్వాన్నంగా తయారైనా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవటం లేదని లోక్‌సత్తా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లేటి రమేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్కెట్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. గత 50 ఏళ్లుగా యధాతథంగా మార్కెట్‌ను కొనసాగిస్తున్నారని, పెరిగిన జనాభా, అవసరాలకనుగుణంగా మౌలిక సదుపాయాల్ని పెంచటం లేదని అన్నారు. మరోవైపు ప్రజాప్రతినిధుల, అధికారుల జీతభత్యాలు, సౌకర్యాలు మాత్రం పెరుగుతున్నాయన్నారు. పట్టణంలో ఈగలు, దోమల వ్యాప్తికి, అనారోగ్యాలకు మార్కెట్ అపరిశుభ్రత కారణమవుతోందన్నారు. కార్యక్రమంలో ప్రభాకర్, నాగరాజు, సంతోష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో కూడా నేతలు ఈ డిమాండ్ చేశారు. సమావేశంలో కిరణ్, ప్రభాకర్, పుష్ప తదితరులు పాల్గొన్నారు. ✦

# సమర్థులైతే చాలు.. యువతకే పట్టం



సమర్థులు, నిబద్ధత గలవారు అతికొద్ది కాలంలోనే ఎదగగలిగే అవకాశాల్ని అందించటం ఒక స్థాయి పరిణితికి చేరిన ప్రజాస్వామ్య దేశాల లక్షణం. ఈ రకంగానే బ్రిటన్‌లో కామెరాన్, అమెరికాలో ఒబామా కేవలం నాలుగైదేళ్లలో ఏకంగా ప్రధాని, దేశాధ్యక్షుడు కాగలిగారు. అక్కడి ప్రధాన పార్టీలు వారికి ఆ ప్రజాస్వామిక అవకాశాన్నిచ్చాయి. మనదేశంలోలా వంశపారంపర్య రాజకీయాలతో అడ్డుకోలా. ప్రజలు కూడా వయసు, కొత్త, పాత తేడా లేకుండా సమర్థులైన యువతకు పట్టం గట్టారు. కెనడాలో జస్టిన్ ట్రూడ్, ఫ్రాన్స్‌లో ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ కూడా కాస్త తేడాతో ఈరకంగానే ఎన్నికయ్యారు. ఇటీవల ఆస్ట్రియాలో సెబాస్టియన్ కర్జ్ (31) ఛాన్సలర్‌గా ఎన్నికయ్యారు. ఐరోపా యూనియన్‌లోనే అత్యంత పిన్నవయసు దేశాధినేతగా రికార్డు సృష్టించారు. ఆయన నేతృత్వంలోని పీపుల్స్ పార్టీకి 31.4శాతం ఓట్లు రాగా, దామాషా పద్ధతిలో విజేతను ప్రకటించారు. రాజకీయాల్లోకి ఎవరైనా ప్రవేశించవచ్చని, సమాజంలో మార్పు కూడా రాజకీయ ప్రవేశంతోనే సాధ్యమని విశ్వసించిన సెబాస్టియన్ కర్జ్.. పీపుల్స్‌పార్టీ ప్రతినిధిగా 27 ఏళ్లకే విదేశాంగ మంత్రి అయ్యారు. ఆ దేశాల్లో ఈరకమైన పరిణతి రావడానికి ఎన్నో శతాబ్దాలు పట్టింది కదా, మనదేశంలో కూడా ఆ మార్పు రావటానికి టైం పడుతుంది అనుకోవడానికి వీల్లేదు. ఎందుకంటే, ఆదేశాలకున్నంత సమయం ఈవేళ మనకు లేదు. టెక్నాలజీ, యువతను ఉపయోగించి సమాజంలో ఆలోచనాపరులు, విజ్ఞులు, మీడియా, వనరులున్నవారు ఈ మార్పును వేగంగా సాధించకపోతే.. భారత్ చాలా నష్టపోవాల్సి ఉంటుంది. ఈ క్రమంలోనే లోక్‌సత్తా బహుముఖ పోరాటం చేస్తోంది. ✦

# గ్రంథాలయ సొమ్ము మీ దగ్గర ఉంచుకోవడానికి వీల్లేదు





గ్రంథాలయ పన్ను (లైబ్రరీ సెస్సు)ను హైదరాబాద్ సిటీ గ్రంథాలయ సంస్థ ఖాతాలో జమచేయకపోవడాన్ని హైకోర్టు తప్పుపట్టింది. గ్రంథాలయ సంస్థలు అభ్యర్థించకుండానే ప్రజల నుంచి వసూలు చేసిన ఆస్తిపన్నులో 8శాతం వాటాను గ్రంథాలయాలకు చెల్లించాల్సి ఉండగా.. ఆ మేరకు ఎందుకు చెల్లించడం లేదని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. లోక్‌సత్తా పార్టీ జీహెచ్ఎంసీ యూనిట్ నేత డి.నరసింహం దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యం మరోమారు విచారణకు వచ్చిన సందర్భంగా హైకోర్టు ఈ ప్రశ్నలు సంధించింది. పిటిషనర్ తరపున లోక్‌సత్తా యువ వలంటీర్, న్యాయవాది వై.షీలూరాజ్ వాదనలు వినిపించారు.

నగరంలో వసూలు చేసిన పన్నులోని వాటాను హైదరాబాద్ సిటీ గ్రంథాలయాలకు చెల్లించకపోవడం ఏమిటి? చట్టం అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రజల నుంచి ఎంత మొత్తంలో గ్రంథాలయ పన్ను వసూలు చేశారు? అందులో ఎంత మొత్తాన్ని హైదరాబాద్ సిటీ గ్రంథాలయ సంస్థకు ఎప్పుడెప్పుడు ఎంత చెల్లించారు?.. తెలపాలని జీహెచ్ఎంసీని కోర్టు ఆదేశించింది. గతంలో ఈ వ్యవహారంపై ప్రమాణపత్రం దాఖలు చేయాలని ఆదేశించినప్పటికీ ఇప్పటివరకూ చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. సమాచార హక్కు చట్టం ప్రకారం పొందిన వివరాల ప్రకారం 2006 నుంచి 2014 వరకు హైదరాబాద్ సిటీ గ్రంథాలయ సంస్థకు జీహెచ్ఎంసీ రూ.301 కోట్లు పన్ను బకాయి పడినట్టు షీలూరాజ్ తెలిపారు. మునిసిపాలిటీలు, నగరపాలికలు, పంచాయతీలు కూడా ఈ పన్నులు గ్రంథాలయాలకు చెల్లించడం లేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. గ్రంథాలయ సంస్థలకు చెల్లించాల్సిన సొమ్మును మీ దగ్గర ఉంచుకోవడానికి వీల్లేదని జీహెచ్ఎంసీకి కోర్టు స్పష్టం చేసింది. ✦

# పెసర పంటకు మద్దతు ధర ప్రకటించాలి

పెసర పంటకు మద్దతు ధరను ప్రకటించాలని లోక్‌సత్తా పార్టీ సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లేటి రమేష్ కుమార్ డిమాండ్ చేశారు. పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. పెసరలో నాణ్యతలేదనే నెపంతో మద్దతు ధర రాకుండా అడ్డుకుంటున్న దళారులు, వ్యాపారులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. నాగరాజు, కిరణ్, పుష్ప తదితరులు పాల్గొన్నారు. ✦

# ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల్ని మెరుగుపరచండి



ప్రభుత్వ స్కూళ్లలో వసతుల కోసం ఈ ఏడాది రూ.5,000కోట్లు ఖర్చు చేస్తున్నట్టు విద్యాశాఖా మంత్రి చెబుతున్నా.. విజయనగరంలోని బడులు అధ్వాన్నంగా ఉన్నాయని లోక్‌సత్తా పార్టీ ఏపీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. మరుగుదొడ్లు, బోధనాసిబ్బంది తదితర అంశాలకు సంబంధించిన సమస్యలను రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి సంధ్యారాణి దృష్టికి తీసుకెళ్లారు. సరైన చదువు అందించేలా స్కూళ్లలో పర్యవేక్షణ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ✦

# యువతంటే నాయకుల కొడుకులు కాదు.. లోక్‌సత్తా పార్టీలో చేరిన యువత



యువత రాజకీయాల్లోకి రావాలని పిలుపునిస్తూ నాయకులు తమ కుమారుల్ని నాయకులుగా చేసుకుంటున్నారని, సామాన్యుల చేత జెండాలు మోయిస్తున్నారని లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. యువత రాజకీయాలను పట్టించుకోకపోతే పెనుప్రమాదం ఉంటుందని, రాజకీయాలంటే కేవలం ఎన్నికలు మాత్రమే కాదని, సమాజం గురించిన ఆలోచన కూడా రాజకీయమేనని సురాజ్య యాత్రలో జేపీ చెప్పిన మాటలు పలువురు యువతీయువకులను ఆలోచింప చేస్తున్నాయన్నారు.

విజయనగరంలోని లోక్‌సత్తా పార్టీ కార్యాలయంలో పట్టణంలోని 24వ వార్డుకు చెందిన పలువురు యువత లోక్‌సత్తాలో చేరారు. వారిని కండువా వేసి బాబ్జీ ఆహ్వానించారు.

రాష్ట్రంలో, దేశంలో యువతకు సరైన ఉపాధి అవకాశాలు లేవని, ఉత్తరాంధ్రలోనే 3లక్షలమందికి తక్షణం ఉద్యోగాలు కావాలని బాబ్జీ ఈ సందర్భంగా అన్నారు. అయినా పాలకులకు ఈ సమస్య పట్టటం లేదన్నారు. నిరుద్యోగ భృతితో బిచ్చమేసినట్టు విదులుస్తున్నారన్నారు. యువత ప్రశ్నించాలన్నారు. జనం కోసం జేపీ సురాజ్య యాత్రకు వస్తున్న స్పందన రాష్ట్రంలో నిర్మాణాత్మక మార్పునకు దోహదం చేస్తుందన్నారు.

మహిళాసత్తా జిల్లా అధ్యక్షురాలు ఇనగంటి అనంతలక్ష్మి మాట్లాడుతూ, ప్రజాధనం అవినీతితో, దుబారాతో, తప్పుడు విధానాలతో దుర్వినియోగమవుతోందని, దీన్ని అవగాహనతో యువత అడ్డుకోవాలని అన్నారు.

లోక్‌సత్తా పార్టీ పట్టణ అధ్యక్షుడు మొల్లేటి చిన్నారావు, రాజారావు తదితరులు పాల్గొన్నారు. పార్టీలో చేరినవారిలో లక్ష్మణరావు, అనిల్, పెంటబాబు, తీడుబాబు, లోకేష్, ఉమా, అప్పలరాజు, శేఖర్, ఎన్.రాజు, నవీన్, శ్రీను, భాస్కర్, అప్పారావు, నారాయణరావు తదితరులున్నారు.

### పెట్రో నష్టాలపై యనమల, చంద్రబాబు సమాధానం చెప్పాలి

రాష్ట్రంలో పెట్రో ట్రేడర్ల సమస్యలను పరిష్కరించకపోవటం వల్ల, అవగాహన లేకుండా పన్నులు విధించటం వల్ల రూ.3,000కోట్ల దాకా ఆదాయం దెబ్బతిందని అంచనాలు చెబుతున్నాయని, దీనిపై ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు సమాధానం చెప్పాలని బాబ్జీ డిమాండ్ చేశారు. ✦

# కౌన్సిలర్ దురాగతాన్ని నిలువరించండి



వీటీ అగ్రహారం రెడ్డి వీధిలోని కమ్యూనిటీ భవనాన్ని కూల్చివేసి ఆ స్థలమును ఆనుకుని ఉన్న తన మిత్రుడైన ఉపాధ్యాయుడు ఆక్రమించునేందుకు సహాయపడిన తెదేపా కౌన్సిలర్ దురాగతాల్ని అడ్డుకోవాలని లోక్‌సత్తా కార్యకర్తలు అధికారులకు ఫిర్యాదు చేశారు. గణేష్‌నగర్ ప్రాంతంలో కాల్వల్ని తవ్వి వదిలేశారని, కనీస సౌకర్యాలు లేవని, వీటిపై ఇప్పటికే ఒకసారి గ్రీవెన్స్ విభాగానికి ఫిర్యాదు చేసినా చర్యలు లేవన్నారు. కౌన్సిలర్ పట్టించుకోవటం లేదన్నారు. తక్షణం వీటిపై చర్యలు తీసుకోవాలన్నారు. ✦

# (మీడియాలో) 'కీ' కామెంట్లు!

■ రాజకీయాల్లో అసలైన గెలుపు అంటే ఏమిటి? ఓ కొత్త పార్టీ పెట్టి అభ్యర్థుల్ని ఎంపిక చేసుకుని మెజారిటీతో గెలిచి ముఖ్యమంత్రి అయిపోవడమా? కొన్నేళ్ల క్రితం పార్టీ పెట్టి గెలిచినవారు కూడా ప్రజలకు ఆరోగ్యం, విద్యపరంగా ఎలాంటి అభివృద్ధీ చేయలేదు. రాజకీయాల్లో గెలవటం ఒక్కటే ముఖ్యం కాదు.

– కమల్ హాసన్, ప్రముఖ సినీనటులు

❐ కేంద్ర కార్మిక విభాగం గణాంకాల ప్రకారం 2011-12లో 3.8శాతంగా ఉన్న నిరుద్యోగిత, 2015-16నాటికి 5.0శాతానికి పెరిగింది. దేశంలోని ప్రతి ముగ్గురు పట్టభద్రుల్లో ఒకరు నిరుద్యోగేనని అంచనా! కొంతకాలంగా నిర్మాణ, ఉత్పత్తి, సేవారంగాల మందగించడంతో పెద్దఎత్తున ఉద్యోగాలు కొడిగట్టినట్టు వార్తలు వినిపించాయి. ఈ సమస్యకు పరిష్కారాలను అన్వేషించే క్రమంలో కేంద్రప్రభుత్వం 2015 జులైలో జాతీయ ఉపాధి సేవాకేంద్రం (నేషనల్ కెరీర్ సర్వీస్) ప్రారంభించింది. ఉపాధి ఆశిస్తున్న అభ్యర్థులు, ఉద్యోగాలు ఇవ్వజూపే వ్యాపార, వర్తక, వాణిజ్య సంస్థలు ఆ కేంద్రంలో తమ పేర్లు నమోదు చేసుకోవచ్చు. ఉద్యోగార్థులు, సంస్థలకు మధ్య ఈ కేంద్రం వారధిగా పనిచేస్తుందని, తద్వారా ఉద్యోగ కల్పన సులభమవుతుందని ప్రభుత్వం భావించింది. ఈ సేవను ప్రారంభించిన కొద్దినెలలకే దేశవ్యాప్తంగా సుమారు కోటిమంది ఉద్యోగార్థులు తమ పేర్లు నమోదు చేసుకున్నారు. 2017 మే నాటికి దేశంలోని వంద కేంద్రాల్లో ఏకంగా 3.87కోట్లమంది నమోదయ్యారు. ఉద్యోగార్థుల నుంచి వచ్చిన స్పందన- అటు ఉపాధి కల్పన సంస్థల నుంచి రాలేదు. 2017 మే నాటికి ఈ కేంద్రాల్లో సుమారు 15 లక్షల సంస్థలు మాత్రమే తమ పేర్లు నమోదు చేసుకున్నాయి. ప్రస్తుత నిబంధనల ప్రకారం కేంద్ర ప్రభుత్వ విభాగాలూ ఈ కేంద్రాల్లో నమోదుకావాలి. ఈ సంస్థలన్నీ కలిపి 540 ఉద్యోగమేళాలు నిర్వహించి కల్పించిన ఉద్యోగాల సంఖ్య కేవలం 2-3లక్షలే! నమోదైన పదిహేను లక్షల సంస్థలు ఒక్కోటి తలా రెండు ఉద్యోగాలు ఇచ్చి ఉన్నా కనీసం 30లక్షల మందికి లబ్ధి చేకూరి ఉండేది.

– ఆచార్య కోదాటి వియ్యన్నరావు, నాగార్జున విశ్వవిద్యాలయ పూర్వ వైస్ ఛాన్సలర్

❖ గుజరాత్ ఎన్నికల గురించి రాహుల్ గాంధీ, ఆయన పార్టీ ఇస్తున్న వివరణలు కొంచెం జటిలంగా ఉన్నాయి. ఇప్పుడు గుజరాత్‌లో వారికి గెలిచే అవకాశాల్లేవు. ఆ మాటకొస్తే 2019లో కూడా ఇక్కడ వారికి గెలుపు అవకాశాల్లేవు. గతంలో ఆ పార్టీ నేతలు మోదీ జమానా ముగిసేవరకు వేచిచూద్దామనే ధోరణిలో ఉండేవారు. అప్పుడు దేశం మళ్లీ కాంగ్రెస్ వైపు మళ్లుతుందనేది వారి ఆలోచన. దేశానికి కాంగ్రెస్ పార్టీ డిఫాల్ట్ ఆపరేటింగ్ సిస్టం అన్న రాహుల్‌గాంధీ ప్రకటనను ఇక్కడ మనం గుర్తుచేసుకోవాలి. అయితే అది ఇంకెంతమాత్రం వాస్తవం కాజాలదన్న నిజాన్ని వాళ్లు గ్రహిస్తే మంచిది. గెలుపు అసాధ్యమనుకున్న యుద్ధంలో అయినా సరే వాళ్లు పోరాడటానికి ప్రయత్నమే చేయకుంటే విశ్వసనీయమైన రాజకీయశక్తిగా ఎంతమాత్రమూ ఉండజాలరు. ఇలా అయితే మోదీ, షా జోడీ ఎప్పటికీ అజేయమైనదే అవుతుంది. ఇప్పుడు ఇంకా వాళ్ల ప్రధాన లక్ష్యమైన కాంగ్రెస్ ముక్త్ భారత్‌ను సాధించి వెళ్లాలన్న పట్టుదలతో ఉన్నట్టు కనిపిస్తున్నది. కాంగ్రెస్ ఇప్పుడు ఉనికి కోసం కాకుండా పూర్వవైభవం కోసం తన శక్తిని ఉపయోగించాలి. కానీ వాళ్లు గెలుపు కోసం కాకుండా విశ్వసనీయమైన ప్రతిపక్షంగా ఉండాలనే చూస్తున్నారు!

- మిహిర్ స్వరూప్ శర్మ, అబ్జర్వర్ రీసెర్చి ఫౌండేషన్ సభ్యులు

☐ రేపటి పౌరులకు మెరుగైన ప్రపంచాన్ని అందించటం కోసం కృషి చేస్తున్న ప్రతి సంస్థనూ సొంతం చేసుకోవడమే భవిష్యత్తుకు సోపానం.

– ఒర్లాండో బూమ్, ప్రముఖ ఇంగ్లీష్ నటులు

(కర్టెసీ: ఈనాడు, సాక్షి, విశాలాంధ్ర, నమస్తే తెలంగాణ)

# ముఖ్యమంత్రి సొంత జిల్లాలో పల్లె కన్నీరు!


ప్రజా చైతన్యానికే సురాజ్య యాత్ర

- ఇది రాజకీయాలకు అతీతం
- పల్లెలకు నిధుల కేటాయింపులో ప్రభుత్వాలు విఫలం
- పార్లమెంటు, శాసనసభలకు ఒకేసారి ఎన్నికల వల్ల మేలు ఏమీ జరగదు
- లోక్‌సత్తా అధినేత జయప్రకాష్ నారాయణ

**'జనం కోసం జేపీ' సురాజ్య యాత్ర ఆరు లక్ష్యాల్లో స్థానిక ప్రభుత్వాలైన గ్రామపంచాయతీలు, మునిసిపాలిటీలకు రాష్ట్రం నుంచి 50శాతందాకా నిధులు అందాలనేది ఒకటి. జనం ఎక్కడుంటే అక్కడే నిధులు, అధికారాలు ఉండాలన్నది సురాజ్య డిమాండ్. రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో పౌరుని మీదా ఏటా రూ.30,000 ఖర్చు చేస్తున్నందున అందులో సగం (50శాతం) స్థానికంగా ప్రజలుండే పట్టణాలు, నగరాలు, పల్లెలకు నేరుగా కేటాయించాలని సురాజ్య యాత్రలో లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జేపీ ప్రజలకు వివరించి చెబుతున్నారు. కనీసం 10శాతంతో మొదలుపెట్టయినా స్థానిక ప్రభుత్వాలకు సగం నిధుల కేటాయింపు చేయాలంటున్నారు.**

**సురాజ్య యాత్రలో భాగంగా జేపీ చిత్తూరు జిల్లా పర్యటనను తిరుపతి నుంచి మొదలుపెట్టారు. ఫెడరల్ సూత్రం ప్రకారం రాష్ట్రం నుంచి 50శాతం నిధులొస్తే.. నాలుగు లక్షలు జనాభా ఉండే తిరుపతికి రూ.600కోట్లు రావాలని జేపీ చెప్పారు. పదిశాతం ఇచ్చినా 120కోట్లు వస్తాయన్నారు.**

**ప్రతి ఊరుకీ జనాభాను బట్టి స్థానికంగా అలా డబ్బు ఉంటే.. ఎక్కడిపనులు అక్కడే త్వరగా పూర్తవుతాయని, లంచగొండుల కాలర్ పట్టుకోవచ్చని జేపీ వివరించారు. స్థానికంగా తప్పుజరిగితే పైన రాష్ట్ర ప్రభుత్వం దుడ్డుకర్ర పట్టుకుని చర్యలు తీసుకోవచ్చన్నారు. అవినీతిపరుల పదవులు ఊడబీకొచ్చని, ఆస్తులన్నీ జప్తు చేయవచ్చనీ అన్నారు.**

**పార్టీలకతీతమైన సురాజ్య లక్ష్యాలు ప్రజల నిత్యజీవితంలో ఎంత అవసరమో తెలియచేసేలా ప్రచారం చేయాలని యువతను, ఇతర ఆలోచనాపరుల్ని జేపీ కోరారు. ఇందుకు సామాజిక మాధ్యమాలను, ఇతర సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించాలని సూచించారు. సురాజ్య కోణంలో వార్తల్ని విశ్లేషిస్తూ రాయాలని ప్రాచుర్య మీడియాకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. ఈ క్రమంలో ఓ ప్రముఖ దినపత్రిక టాబ్లాయిడ్‌లో పలమనేరు డేట్‌లైన్‌తో ఒక చక్కటి వార్తావిశ్లేషణ ప్రచురితమైంది.**

**ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సొంత జిల్లా చిత్తూరులో గ్రామ పంచాయతీల పరిస్థితి ఎంత అధ్వాన్నంగా ఉందో వివరించిన ఆ పత్రికను, రిపోర్టర్‌ను మనసారా అభినందిస్తూ, కథనాన్ని లోక్‌సత్తా టైమ్స్ పాఠకుల కోసం యథాతథంగా అందిస్తున్నాం..**

పలమనేరు: పంచాయతీల కాలపరిమితి మరో నాలుగు నెలల్లో ముగియనుంది. నిధుల లేమి, సొంత ఆర్థిక వనరులు, స్థిరాస్తులు లేకపోవడం వంటి ప్రధాన సమస్యలతో పంచాయతీలు అభివృద్ధికి నోచుకోలేకపోతున్నాయి. దశాబ్దాలుగా పంచాయతీలు నిర్దిష్టంగా ఎలాంటి ఆదాయాలు సమకూర్చుకోలేకపోతున్నాయి. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాకపోవడం, ఎక్కడికక్కడ ప్రభుత్వ, ట్రెజరీ ఆంక్షలతో పంచాయతీలు స్వయంసమృద్ధిని సాధించలేక చతికిలపడుతున్నాయి. ప్రస్తుతం జన్మభూమి కమిటీ సభ్యులకు పెత్తనం ఇవ్వడంతో సర్పంచ్ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైంది. వచ్చే ఏడాది ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలను నిర్వహించడానికి సిద్ధమవుతున్న తరుణంలో ప్రజల నుంచి తీవ్రస్థాయిలో విమర్శలను ఎదుర్కొనే పరిస్థితి ఉంది.



**ఇది కూర్మాయి పంచాయతీ పరిధిలోని ఆరోగ్య ఉపకేంద్రం. పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. ఇక్కడ వైద్యపరీక్షలు చేయడం లేదు. దాంతో పంచాయతీ పరిధిలోని ఆరు గ్రామాల ప్రజలు పట్టణానికి వెళ్లాల్సి వస్తోంది. కనీసం ప్రభుత్వం ఈ భవనానికి మరమ్మతులు చేసి వైద్యపరీక్షలు నిరంతరం జరిగేలా చూస్తే పంచాయతీలోని ప్రజలకు వైద్యసేవలు అందుతాయి.**

**తలసరి గ్రాంటు నిల్..**

పంచాయతీలకు గత రెండేళ్లుగా తలసరి గ్రాంటు రాలేదు. 14వ ఆర్థిక సంఘం నిధులతో కలిపి వచ్చినా తక్కువ వస్తోంది. ఒక మనిషికి రూ.4 ఇస్తున్నారు. దాన్ని రూ.10 చేస్తామని ప్రభుత్వం చేసిన ప్రకటన ఆచరణలోకి రాలేదు. స్వచ్ఛభారత్



పెంగరగుంట పంచాయతీలోని జంగాల పల్లె గ్రామంలోని రోడ్డు ఇది. వర్షానికి పూర్తిగా కోతకు గురై కంకర తేలిపోయింది. ఈ రోడ్డు మీద ప్రతిరోజు ప్రజలు నడవాలి. గ్రామంలో మొత్తం రెండువేల మంది ఉన్నారు. వీరు ప్రధాన రహదారికి చేరాలంటే ఈ మార్గంలో వెళ్లాలి. సిమెంటు రోడ్డు వేయడానికి పంచాయతీ పరిధిలోని ప్రజలు, సర్పంచి చేస్తున్న విజ్ఞప్తులకు అధికారులు స్పందించడం లేదు.



పంచాయతీల్లో 50శాతం మహిళా సర్పంచులు ఉంటే వారికి తగిన ప్రాధాన్యత లేదు. వారు రాజకీయంగా తమ ప్రాభవాన్ని చూపలేక వెనుకబడిపోయే పరిస్థితి ఏర్పడుతోంది. ప్రభుత్వం మహిళా సర్పంచులు ఉన్న చోట ప్రత్యేక శ్రద్ధ చూపడం లేదు. సమావేశాలకు కూడా ఇబ్బందులతోనే హాజరుకావాలి. పంచాయతీ కార్యాలయాల్లో సరైన వసతులు లేక మహిళా సర్పంచులు ఇబ్బందులు పడాలి. ప్రభుత్వం మహిళా సర్పంచులు ఉన్నచోట ప్రత్యేక నిధులు విడుదల చేయాల్సి ఉంటుంది. పురుషులతో సమానంగా రాజకీయ పలుకుబడి చూపలేకపోవడంతో కొంతవరకు జిల్లా పరిషత్ నుంచి, ప్రజాప్రతినిధుల నుంచి వచ్చే మొత్తాలు తగ్గిపోతున్నాయి.

– సంపూర్ణమ్మ, సర్పంచ్, కూర్మాయి

పథకం కింద తలసరి గ్రాంటు పెంచుతామన్నా పెంచలేదు. ఎస్ఎఫ్సీ నిధులు గత అయిదేళ్లుగా రాలేదు. జనరల్ ఫండ్ ద్వారా పనులు చేసుకోవాలి. పంచాయతీలు పన్నుల రూపంలో రావలసిన ఆదాయాన్ని వసూలు చేసుకునే స్థితిలో కూడా లేవు. రాజకీయ కారణాలతో బకాయిలు పేరుకుపోతున్నాయి. చెరువుల వేలాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఇలాంటి పరిస్థితిలో పంచాయతీలు స్వయంసమృద్ధిని సాధించ లేకపోతున్నాయి. మండలస్థాయి నాయకులు ప్రాతినిధ్యం వహిస్తున్న పంచాయతీలకు మాత్రమే కొంతవరకు మండల నిధులను తెచ్చుకునే అవకాశం కనిపిస్తోంది. జిల్లా పరిషత్ ద్వారా విడుదలైన నిధులను పరిశీలిస్తే సమతుల్యత పాటించడం లేదని స్పష్టమవుతుంది. ఎమ్మెల్యే నిధులు కూడా అన్ని పంచాయతీలకు సమానంగా అందటం లేదు. పట్టణాలకు వలస పోండి అని ప్రభుత్వమే ప్రోత్సహిస్తున్నట్టుంది.

### సొంత భవనాలు లేవు

పంచాయతీ రాజ్ వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని చెప్పే ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు సొంత భవనాలు సమకూర్చలేకపోతోంది. కనీసం విద్యుత్ బిల్లులు చెల్లించే స్థితిలో



ఇది వి.కోటలోని వారపు సంత. ఈ సంత ద్వారా పంచాయతీకి ఏటా రూ.3.5లక్షల ఆదాయం వస్తుంది. అయితే ఇక్కడ కనీస వసతులు లేవు. 90వేల జనాభా ఉన్నా వి.కోట పంచాయతీలో మౌలిక వసతులు మృగ్యం.

### తలసరి గ్రాంటు రావడం లేదు

ఇటీవల తలసరి గ్రాంటు రాలేదు. 14వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేస్తాం. కొంతవరకు పంచాయతీలు స్వయంసమృద్ధి సాధించుకోవలసిన అవసరం ఉంది. ఆదాయవనరులను పెంచుకోవాలి. ఆ దిశగా అవగాహన పెంచుతున్నాం. కంప్యూటర్లు నిర్వహించేవారికి కూడా పెద్దగా జీతాలు లేకపోవడంతో కొన్ని చోట్ల పనులు మందకొడిగా సాగుతున్నాయి. ఇందుకోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పనులు చేయించడానికి ప్రయత్నిస్తున్నాం.

– టి.లక్ష్మి, డీఎల్పీవో, మదనపల్లె




కూడా పంచాయతీలు లేవు. ఎల్ఈడీ బల్బులు వస్తాయని సాధారణ బల్బులు కూడా బిగించక చీకట్లో గ్రామాలు మగ్గుతున్నాయి. మహిళా సర్పంచులకు మరుగుదొడ్లు లేవు. విద్యుత్ వసతి లేని పంచాయతీ కార్యాలయాలున్నాయి. నిధుల పరిస్థితి చూసి.. చేసిన పనులకు బిల్లులు వస్తే చాలనే స్థితిలో సర్పంచులు నిరాశాజనకంగా కనిపిస్తున్నారు. పంచాయతీలో చేసిన కొద్దోగొప్పో పనులకు బిల్లులు చేసుకోవడానికి కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణాలు చేస్తున్నారు. అభివృద్ధి గురించి వారు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. పారిశుద్ధ్యం విషయంలో ఏమాత్రం శ్రద్ధ పాటించడం లేదు. ఇక వైద్యచికిత్సలు కూడా ప్రజలకు అందటం లేదు. గ్రామాల్లో ఉన్న ఆరోగ్య కేంద్రాలు కూడా దుస్థితిలో ఉన్నాయి. దాంతో ప్రజలు వైద్యపరీక్షల కోసం పట్టణాలకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడుతోంది.

### ఈ-పంచాయతీలు అంతంత మాత్రమే


ఈ-పంచాయతీలు కూడా అంతంత మాత్రంగానే నడుస్తున్నాయి. అన్ని పంచాయతీలకు కంప్యూటర్లు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం కేవలం క్లస్టర్లకు మాత్రం ఇచ్చి మిగిలినవాటిని వదిలేసింది. దాంతో ఈ పథకం పూర్తిగా అమలుకావడం లేదు. కంప్యూటర్లు ఉన్న చోట ఆపరేటర్లు లేకపోవడంతో అవి కూడా మూతపడ్డాయి. వారికి సక్రమంగా ప్రభుత్వం నుంచి జీతాలు రావడంలేదన్న విమర్శలు కూడా ఉన్నాయి. ✦




# మీ జీవితంలో మీరే హీరోలు

Join & Participate: www.youthforbetterindia.com

Posting Date 22-11-2017
RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2016-18 Published on November 16th 2017



# ప్రతి రోజు ఒక్క హైదరాబాద్ మహా నగరంలోనే దాదాపు రూ. 1,55,00,000/- !

# పెట్రోలు బంకుల మోసాలను ఎలా అరికట్టాలి?



## Watch YBI webinar series for solutions at
## **https://www.facebook.com/JPLOKSATTA/**

| Book-Post<br>PRINTED MATTER<br><br>If not delivered please return to:<br><br>Lok Satta Times<br>Tulips Apartment,<br>6-3-655, Flat.No. 407,<br>Behind Civil Supplies Office,<br>Somajiguda<br>Hyderabad- 500082 | To |
|---|---|

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad